FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

TGTEL/25/A1964
తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :116 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 16 -డిసెంబర్ - 2025

# సర్కార్‌తోపాటు వందేభారత్



నరసాపురం నుంచి చెన్నై వరకు సేవలు

కేంద్ర సహాయ మంత్రి ప్రారంభం

గమ్యస్థానాలకు తక్కువ సమయంలో చేరువ

అలుపెరుగని సేవలందించిన సర్కార్

అమరావతి : ఆ ప్రాంతం వారికి ఒక్క సర్కారు రైలు బండే ఏకైక రవాణా మార్గం. ఎక్కడికి వెళ్లాలన్న అది ఉందన్న ధీమాతోనే ఉంటారు మిగతా..2లో

# జీహెచ్‌ఎంసీ డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్



పిటిషన్ దాఖలు చేసిన వినయ్ కుమార్ అనే వ్యక్తి

పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని హైకోర్టును కోరిన పిటిషనర్

పునర్విభజనలో అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలన్న పిటిషనర్

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వినయ్ కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని ఆయన ఉన్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై మిగతా..2లో

## దోహాలో తెలుగు వారి సందడి - ఘనంగా "సాంస్కృతిక సమ్మేళనం"



2

- దోహాలో ఘనంగా తెలుగు కళా సమితి వారి "సాంస్కృతిక సమ్మేళనం"
- ఇండియన్ కల్చరల్ సెంటర్? ఆధ్వర్యంలో నిర్వహణ
- ఆహుతులను ఆకట్టుకున్న నృత్యాలు, సంగీత ప్రదర్శనలు

# కేంద్ర ప్రభుత్వం పేదల పొట్ట కొడుతోంది

- పేదల పొట్టకొట్టడమే కేంద్ర లక్ష్యమని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం
- గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం దుర్మార్గమని విమర్శించారు.
- కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించినా, విధాన మార్పులతో పథకం అసలు ఉద్దేశమే దెబ్బతింటోందని సీతక్క స్పష్టం



హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం పథకం పేరు మార్పులను తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా తప్పుబట్టారు. పేదల పొట్టకొట్టడమే కేంద్ర లక్ష్యమని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతోందని అన్నారు. మిగతా..2లో

# కాంగ్రెస్ నేతల దాడిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం...

- బీఆర్ఎస్ అభ్యర్థిని ట్రాక్టర్‌తో ఢీ కొట్టి హత్యాయత్నం...
- సోమార్‌పేట్ ఘటనపై ఎస్పీకి ఫోన్ చేసిన కేటీఆర్...
- దాడికి పాల్పడిన వారిపై తక్షణ అరెస్టులు డిమాండ్...



వివరాలు 2లో..

కామారెడ్డి.డిసెంబర్15 : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సోమార్‌పేట్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం చోటు చేసుకున్న అమానుష ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీ నేతల గూండాగిరి హద్దులు దాటిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

## చైనా పార్టులు వద్దు.. రూ.5,000 కోట్లతో స్వదేశీ డ్రోన్ల కొనుగోలుకు ఆర్మీ సిద్ధం



2

- భారీగా దేశీయ డ్రోన్లను సమకూర్చుకోనున్న సైన్యం
- కామికేజ్, నిఘా, సుదూర లక్ష్య ఛేదన డ్రోన్ల సమీకరణ
- జామింగ్, స్పూఫింగ్‌ను తట్టుకునేలా ప్రత్యేక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యం

# బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు

- బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు
- రాష్ట్రాల్లో కాకుండా జాతీయస్థాయిలో ఇలాంటి నియామకం ఇది రెండోసారి.
- పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న నితిన్ నబీ, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ విగ్రహాల వద్ద పుష్పాలు ఉంచి నివాళు లర్పించారు.





మిగతాది 2లో

ఢిల్లి : బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు స్వీకరించారు. దిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. మధ్యాహ్నం పట్నా నుంచి దిల్లీ చేరుకున్న నితిన్ నబీకి దిల్లీ విమానాశ్రయంలో సీఎం రేఖా గుప్తా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న నితిన్ నబీ, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ విగ్రహాల వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు.

# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం

- జాగృతిని రాజకీయ పార్టీగా మార్చే దిశగా సంకేతాలు
- గ్రామస్థాయిలో జాగృతి కమిటీలు ఏర్పాటు చేస్తామన్న కవిత
- కొత్త పార్టీ పేరుపై నెటిజన్ ప్రశ్నకు ఆసక్తికర సమాధానం



2

హైదరాబాద్: జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేశారు. 2029లో జరిగే ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ఆమె నెటిజన్లతో 'ఆస్క్ కవిత' పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఓ నెటిజన్.. "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ప్రశ్నించగా,

## భోగాపురంలో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ..





2

- విమానయాన, రక్షణ రంగాల్లో నైపుణ్యాల కొరత తీర్చడమే లక్ష్యం
- 160 ఎకరాల్లో జీఎంఆర్ మాన్సాస్ ఆధ్వర్యంలో నిర్మాణం
- అంతర్జాతీయ వర్సిటీలతో విద్యా, ఆవిష్కరణల హబ్‌గా రూపకల్పన

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలి ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ ఎడ్యుకేషన్ సిటీని

## ముగిసిన తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం

తెలంగాణ రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం నేటి(సోమవారం)తో ముగిసింది.

డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి.

తుది విడత ఎలక్షన్ డిసెంబర్ 17న జరగనుంది. దీంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఇవాల్టితో ముగిసింది.





వివరాలు 2లో..

హైదరాబాద్: తెలంగాణ, డిసెంబర్ 15: రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుది విడత ఎలక్షన్ డిసెంబర్ 17న జరగనుంది. దీంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

# ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ...

## మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో లోకేశ్ కీలక భేటీ

### కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ

- రాష్ట్రవ్యాప్త నైపుణ్య గణనకు సహకరించాలని విజ్ఞప్తి
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు మద్దతు కోరిన లోకేశ్
- ఏపీలో ఏఐ మిషన్ వేగవంతానికి సాయంపై కీలక చర్చ
- లోకేశ్ వినతులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి



మిగతాది 2లో



అమరావతి : రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టనున్న పలు కీలక ఐటీ, నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. లోకేశ్ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో చేపట్టనున్న నైపుణ్య గణన కోసం ఏఐ టెక్నాలజీతో

మొదటి పేజి తరువాయి

## ముగిసిన తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం

ఇవాళ్టితో ముగిసింది. ఇన్ని రోజులు గ్రామాల్లో హోరెత్తించిన మైకులు మూగబోయ్యాయి. డిసెంబర్ 17న 182 మండలాలు 4157 గ్రామ పంచాయతీలు,28, 406 వార్డుల్లో పోలింగ్ జరగనుంది. తుది విడతలో 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 53 లక్షల 6వేల 401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 26 లక్షల 1861 పురుష ఓటర్లు, 27 లక్షల 4 వేల 394 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలానే146 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. తుది విడత పంచాయతీ ఎన్నికల కోసం 36 వేల 483 పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఇవాళ(సోమవారం) సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఎల్లుండి(బుధవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తుది విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. ఇక రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ దుమ్మురేపింది. మొత్తం 4,333 స్థానాల్లో సగాని కంటే ఎక్కువ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కుమురం భీం, జనగామ, నిర్మల్ జిల్లాల మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. తొలి విడత మాదిరిగానే రెండో విడతలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మద్దతుదారులకు నిర్మల్ జిల్లాలో మెజారిటీ స్థానాలు వచ్చాయి.

## ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ...
## మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో లోకేశ్ కీలక భేటీ

రూపొందించిన 'నైపుణ్యం పోర్టల్' గురించి లోకేశ్ కేంద్ర మంత్రికి వివరించారు. ఇప్పటికే మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించామని, ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఈ బృహత్ కార్యక్రమానికి కేంద్రం సహాయం అందించాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని యువ పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేంద్రం అండగా నిలవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఐటీ శాఖ పరిధిలోని స్టార్టప్ హబ్' ద్వారా మద్దతు అందించాలని కోరారు. ఇదే హబ్‌లో యానిమేషన్, ఏఆర్/వీఆర్ వంటి అత్యాధునిక టెక్నాలజీస్ కోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కూడా సహకరించాలని విన్నవించారు. ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణను వేగవంతం చేసేందుకు మద్దతివ్వాలని కోరారు. ఈ భేటీలో లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు కూడా ఉన్నారు.

## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం: కవిత

"ఎలా ఉండాలో మీరే చెప్పండి" అంటూ కవిత సమాధానమిచ్చారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. త్వరలోనే జాగృతి సంస్థ కార్యకలాపాలను గ్రామస్థాయి వరకు విస్తరిస్తామని, ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. జాగృతి సంస్థ ద్వారానే ఎన్నికల బరిలో నిలవబోతున్నట్లు పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. 2047 నాటికి దేశ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే తన జీవిత లక్ష్యమని కవిత పునరుద్ఘాటించారు. ఇదే తన విజన్, మిషన్ అని ఆమె పేర్కొన్నారు. కవిత తాజా ప్రకటనతో ఆమె భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై చర్చ మొదలైంది.

## జీహెచ్ఎంసీ డివిజన్ల పెంపును
## సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్

జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని వినయ్ కుమార్ పేర్కొన్నారు. రాంనగర్ డివిజన్‌పై తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. అనంతరం ఈ పిటిషన్‌పై విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

### మేయర్‌తో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల భేటీ

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో నగరానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఎక్స్-అఫీషియో సభ్యులు సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో కలిసి కార్పొరేటర్లు మేయర్‌తో భేటీ అయ్యారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనపై ఆమెతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ, డివిజన్ల సరిహద్దులపై మార్కింగ్ చేసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఏ ప్రాతిపదికన డివిజన్ల పునర్విభజన చేశారో చెప్పాలని కోరామని అన్నారు. హైదరాబాద్‌లో డివిజన్ల పునర్విభజనకు ఆదేశిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నగరాన్ని 300 డివిజన్లుగా విభజించారు. ఆయా డివిజన్లకు హద్దులను ప్రకటిస్తూ కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం గెజిట్ ప్రచురించింది.

## చిలకలూరిపేట విద్యార్థులకు హామీ..
## పది రోజుల్లోనే నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

వెంటనే ఆ సమస్యను పరిష్కరించారు. తమకు ల్యాప్ టాప్‌లు కావాలని అడిగిన విద్యార్థులకు పది రోజుల్లోనే సమస్యను పరిష్కరించారు.

రాష్ట్రానికి సహకారం అందించండి: కేంద్రమంత్రిని కోరిన మంత్రి లోకేశ్

పల్నాడు జిల్లా చిలకలూరిపేట శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కంపూటర్లు లేవని పవన్ కల్యాణ్ దృష్టికి కొందరు విద్యార్థులు తీసుకెళ్లారు. దీంతో సోమవారం 25 కంప్యూటర్లను బహూకరించారు. వీటికి సొంతనిధులను వెచ్చించడమే కాకుండా స్కూల్లో అవసరమైన ఫర్నిచర్‌ను సైతం ఆయన అందించారు. పది రోజులు క్రితం ఈ హామీ ఇచ్చారు. తాజాగా మాట నిలబెట్టుకోవడంతో స్కూలు విద్యార్థులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు చెప్పుకున్నారు.అమరావతి : అంధుల మహిళా ప్రపంచ క్రికెట్ కప్ గెలిచిన జట్టు సభ్యులు దీపిక, కరుణకుమారి ఇళ్లకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గృహోపకరణాలు పంపించారు. ఆ క్రికెట్ జట్టుతో శుక్రవారం పవన్ భేటీ అయిన సంగతి తెలిసిందే.

## చైనా పార్టులు వద్దు.. రూ.5,000 కోట్లతో
## స్వదేశీ డ్రోన్ల కొనుగోలుకు ఆర్మీ సిద్ధం

ఢిల్లీ : భారత సైన్యం తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో, సుమారు రూ.5,000 కోట్ల విలువైన పూర్తి దేశీయ డ్రోన్ల కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. శత్రు దేశాల నుంచి ఎదురయ్యే జామింగ్, స్పూఫింగ్ వంటి ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్రాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఈ డ్రోన్లను ప్రత్యేకంగా రూపొందించారు. గతంలో పాకిస్థాన్, ఉగ్రవాద సంస్థలపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సైన్యం ఈ డ్రోన్ల కోసం కఠినమైన పరీక్షలు నిర్వహించింది. అత్యవసర కొనుగోలు నిబంధనల కింద ఈ ప్రక్రియను చేపడుతుండగా, కేవలం దేశీయ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు మాత్రమే అవకాశం కల్పించారు. ముఖ్యంగా, ఈ డ్రోన్లలో చైనాకు చెందిన విడిభాగాలు ఏమాత్రం ఉండకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. ఎకనామిక్ టైమ్స్ కథనం ప్రకారం, సైన్యం మూడు రకాల అవసరాల కోసం ఈ డ్రోన్లను సమకూర్చుకోనుంది. వీటిలో తక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించే కామికేజ్ లేదా లోయిటరింగ్ డ్రోన్లు, సుదూర లక్ష్యాలను గుర్తించి ధ్వంసం చేసి తిరిగి వెనక్కి రాగల ప్రెసిషన్ డ్రోన్లు, నిఘా కోసం ఉపయోగించే యూఏవీలు ఉన్నాయి. ఈ డ్రోన్ల ఎంపిక కోసం భారత సైన్యం ప్రత్యేకంగా ఒక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ టెస్టింగ్ జోన్‌ను ఏర్పాటు చేసింది. ప్రయోగం మొదలైనప్పటి నుంచే తీవ్రమైన జామింగ్ పరిస్థితులను సృష్టించి వాటి పనితీరును పరీక్షించింది. అలాగే, ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో కూడా ఇవి ఎంత సమర్థవంతంగా పనిచేస్తాయో పరిశీలించింది. ఈ పరీక్షల్లో ప్రభుత్వ రంగ సంస్థ అయిన మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, సుమారు రూ.500 కోట్ల విలువైన లోయిటరింగ్ మ్యూనిషన్స్ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ భారీ కొనుగోలుతో భవిష్యత్ యుద్ధాల్లో భారత సైన్యం నిఘా, దాడి సామర్థ్యాలు గణనీయంగా పెరగనున్నాయి.

## కేంద్ర ప్రభుత్వం పేదల పొట్ట కొడుతోంది

గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం దుర్మార్గమని విమర్శించారు. కొత్తగా ప్రతిపాదించిన బిల్లులోను రద్దు చేసి మరో పేరుతో పథకం తెచ్చే ఆలోచన ఉందని, పనిదినాలు పెంచుతున్నట్టు చెప్పినా నిధుల భారం మాత్రం రాష్ట్రాలపై 40 శాతం మోపుతున్నారని తెలిపారు.

సర్పంచ్ అభ్యర్థిపైకి ట్రాక్టర్ ఎక్కించి హత్యాయత్నం.. పిరికిపందలు అంటూ కేటీఆర్ ఫైర్

ప్రస్తుతం కేంద్రం భరించే ఖర్చును తగ్గించి రాష్ట్రాలపై అదనపు భారం వేయడం అన్యాయమని, దీంతో పేదలకు హక్కుగా లభించే పని అవకాశాలు బలహీనపడతాయని అన్నారు. కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించినా, విధాన మార్పులతో పథకం అసలు ఉద్దేశమే దెబ్బతింటోందని సీతక్క స్పష్టం చేశారు.

## భోగాపురంలో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ..

విజయనగరం జిల్లా భోగాపురంలో ఏర్పాటు చేయనుంది. 'జీఎంఆర్ మాన్సాస్ ఎడ్యుసిటీ' పేరుతో రానున్న ఈ ప్రాజెక్టును రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రేపు విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. దేశంలో విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ రంగాల మార్కెట్ విలువ 2034 నాటికి 57 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అయితే, ఈ వేగానికి తగ్గట్టుగా నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో లేవు. దేశం ప్రస్తుతం పైలట్లు (12-15%), ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్లు, భద్రతా నిపుణుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఏటా కేవలం 8 వేల మంది ఏరోస్పేస్ ఇంజనీర్లు మాత్రమే పట్టభద్రులవుతున్నారు.

మొదటి పేజి తరువాయి

# సర్కార్‌తోపాటు వందేభారత్

అక్కడి ప్రజలు. ఆ రైలు ఏ సమయానికొస్తుంది, దాంట్లో ఎంతమంది ఉంటారనేది మొత్తం వారికి తెలుసు. సర్కారు సమాయానికొస్తుందా, ఖాళీ ఉంటదంటారా అని నిత్యం అక్కడివారు స్టేషన్? మాస్టారును అడిగే ప్రశ్నలివి. ఎందుకంటే దానికోసం ఎదురుచూసే ప్రయాణికులు అక్కడ కోకొల్లలు. గోదావరి ప్రజల జీవితాల్లో మమేకం: ఈ సర్కారు రైలు గోదావరి ప్రజల జీవనంలో ఎంతగా కలిసిపోయిందంటే దానిని వారి సొంత వాహనంలా చెప్పుకుంటారు వాళ్లు. ప్రతి మధ్య తరగతి వ్యక్తికి ఓ బతుకు బండిలా మారిపోయిందీ రైలు బండి. ఐదు దశాబ్దాలుగా ఉపాధి, విద్యా, ఆధ్యాత్మిక, పర్యాటక వంటి యాత్రలలో అలుపెరుగని సేవలనందించింది. ప్రస్తుతం దీనికి తోడుగా వందే భారత్ కూడా జిల్లా వాసులందరికి సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించటానికి ముందుకొస్తుంది. నిత్యం రద్దీతో: ఆంధ్రప్రదేశ్?, తమిళనాడు, పుదుచ్చేరి మీదుగా సర్కార్? ఎక్స్?ప్రెస్? సాగుతూ ఎందరో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తుంది. నిత్యం కొన్ని వందల మైళ్లు ప్రయాణించే ఈ రైలు కాకినాడ నుంచి చెంగల్?పట్టు వరకు 755 కి.మీ. 17 గంటల్లో చేరుతుంది. పుదుచ్చేరి వరకు 896 కి.మీ. సుమారు 20 గంటల్లో చేరవేసే సర్కారు ఎప్పుడూ కిక్కిరిసే ఉంటుంది. నిడదవోలు, తణుకు, అత్తిలి, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు ఈ ఉమ్మడి జిల్లాల మీదుగా ప్రయాణిస్తుంది. రాబోయే వందేభారత్ నరసాపురంలో మొదలై భీమవరం టౌన్ మీదుగా చెన్నై చేరుకుంటుంది. ఇలా తూర్పున సర్కార్ ఎక్స్‌ప్రెస్, పశ్చిమాన వందేభారత్ మొదలవుతుంది. సినీనటులకు ప్రియమైనదిగా: ఈ సర్కారు ఎక్స్?ప్రెస్? ప్రతిరోజూ వేల ప్రయాణికులతో పాటు వారి బాధల్ని, సంతోషాల్ని, ఆశయాల్ని కూడా తనతో మోసుకెళ్తుంది.



అంతేకాదు ఎంతోమంది జీవితాల్లో జ్ఞాపకంగానూ మిగిలిపోయింది. మద్రాస్ కేంద్రంగా సినీ పరిశ్రమ నడుస్తున్న సమయంలో జంధ్యాల, బాపు, చిరంజీవి, బ్రహ్మానందం మొదలు త్రివిక్రమ్, సునీల్ వరకు ఈ సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లోనే తమ సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఇలా ఎంతోమంది కళాకారులు ఆ జ్ఞాపకాలను, సర్కారుతో ఉన్న అనుబంధాన్ని నేటికీ పంచుకుంటున్నారు. ఉపాధి నుంచి ఆధ్యాత్మికం వరకు: ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ప్రతిరోజూ 1200 వందల ప్రయాణికులు ఈ రైలు మార్గం ద్వారా చెన్నైతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు ఇది ప్రధాన ఆధారంగా మారింది. భీమవరం టౌన్, ఆకివీడు కేంద్రంగా ఈ ఉత్పత్తుల రాకపోకలు కొనసాగిస్తున్నారు. తీర్థ యాత్రలకు వెళ్లాలనుకునే వారికి నేనున్నానంటూ ఆదుకుంటుందీ సర్కార్?. రాజధాని, తిరుపతి, విజయవాడ, నాగపట్నంలోని ఆలయాలను సందర్శించాలనుకునే వారు చౌక ప్రయాణంగా దీనినే ఎంచుకుంటున్నారు. ముఖ్య నగరాల మీదుగా వస్తున్నందున ఉద్యోగరిత్యా పెద్ద పట్టణాల్లో ఉంటున్న వారు వారంతాల్లో సొంతూళ్లకు రావాలన్న దీనినే ఎంచుకుంటున్నారు. వందేభారత్?తో మరింత ఉపశమనం: సర్కార్?తోపాటు వందేభారత్? అందుబాటులోకి రావడం వల్ల ప్రయాణికులకు మరింత సులభమవుతుంది. చేరుకోవాల్సిన గమ్యాలకు తక్కువ సమయంలో చేరుకుంటున్నారు. ఆర్థిక, సామాజిక, వాణిజ్య రంగాల్లో అభివృద్ధికి అనుగుణంగా జిల్లాలో అనువైన రవాణా సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఆరోగ్య అవసరాల నిమిత్తం విజయవాడ, చెన్నై వంటి పెద్ద పట్టణాలకు సర్కార్?లో 16 గంటలు ప్రయాణం చేస్తున్నారు. కానీ వందేభారత్‌లో 8 నుంచి 9 గంటల్లో వెళ్తున్నారు. దీంతో ఉద్యోగులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర సహాయ మంత్రి ప్రారంభం: వేగంగా ప్రయాణిస్తూ అందరి సమయాన్ని ఆదా చేస్తున్న ఈ వందేభారత్?ను సోమవారం కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించారు. నరసాపురం-చెన్నై సెంట్రల్‌గా మధ్యాహ్నం ఒంటి గంటకు నరసాపురం స్టేషన్లో శ్రీనివాస వర్మ జెండా ఊపారు. ఇప్పుడు ప్రారంభించిన వందేభారత్? రైలు 20678 నంబరుతో నరసాపురం నుంచి మధ్యాహ్నం 2.45కు మొదలై రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు చేరుతుంది. చెన్నై నుంచి ఉదయం 5.35కు 20677 నంబరుతో బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు నరసాపురానికి చేరుతుంది.

# బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు

మొదటి పేజి తరువాయి




తర్వాత నితిన్ నబీని కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అమిత్ షా స్వయంగా తొడ్కొని వెళ్లి కుర్చీలో కూర్చొబెట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పుష్పాలు అందించిన కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఆదివారమే బిహార్‌కు చెందిన 45 ఏళ్ల నితిన్ నబీన్ సిన్హాను పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించినట్లు బీజేపీ ప్రకటించింది. ఈ మేరకు పార్లమెంటరీ బోర్డు నిర్ణయించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటించారు. రాష్ట్రాల్లో కాకుండా జాతీయస్థాయిలో ఇలాంటి నియామకం ఇది రెండోసారి. గతంలో నడ్డా కూడా ఇలాంటి పదవిలోకి మొదట వచ్చారు. ప్రస్తుతం జాతీయ అధ్యక్షుడిగా ఆయన పదవీకాలం ఇప్పటికే ముగియగా పొడిగింపులో ఉన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బిహార్ సరిహద్దుల్లోని బంగాల్ ప్రాంతంలో ప్రభావం చూపే ఉద్దేశంతో ఇప్పుడు సిన్హాను అనూహ్యంగా తెరమీదికి తెచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే జనవరి 14 తర్వాత సిన్హాను లాంఛనంగా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకొనున్నట్లు తెలుస్తోంది. దీంతో చిన్నవయసులోనే పార్టీ పగ్గాలు చేపట్టినవారిలో ఒకరిగా, బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా ఆయన రికార్డ్ సృష్టించనున్నారు. కాగా, ఏప్రిల్‌లో జరగబోయే పార్టీ జాతీయ మండలి సమావేశం ఆయన ఎన్నికను ధ్రువీకరించనుంది.

### ఓటమి తెలియని నాయకుడు

బిహార్?లోని కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. ఇటీవలి ఎన్నికల్లో బిహార్‌లోని బాంకీపుర్ నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రముఖ సినీనటుడు శత్రుఘ్నసిన్హా కుమారుడు లవ్‌సిన్హాపై 84వేల ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. అంతకుముందు పార్టీ యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఛత్తీస్‌గఢ్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేసి అక్కడ బీజేపీని అధికారంలోకి తేవడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన తండ్రి నబీన్‌కిశోర్ ప్రసాద్ సిన్హా బిహార్ బీజేపీలో పెద్దనేతగా గుర్తింపు పొందారు. 2005లో తండ్రి ఆకస్మిక మరణంతో నితిన్ 26 ఏళ్ల వయసులో రాజకీయాల్లోకి ప్రవేశపెట్టారు. 2006లో జరిగిన ఉప ఎన్నికలో తొలిసారి గెలిచిన ఆయన ఆ తర్వాత, ఎన్నడూ ఓటమి చవిచూడలేదు. 1980 మే 23న రాంచీలో జన్మించిన నబీన్‌సిన్హా విద్యాభ్యాసం దిల్లీలో పూర్తయింది.

### బిహార్ బీజేపీ చీఫ్?గా సంజయ్?

మరోవైపు బిహార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సంజయ్ సరోగయ్?ను నియమించింది అధిష్ఠానం. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ఈ మేరకు జేపీ నడ్డా నియమించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ వెల్లడించారు. గతంలో బిహార్ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించిన ఆయన, ధర్భంగా నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

# కాంగ్రెస్ నేతల దాడిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం...

మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ నేతలు అధికార మదంతో విర్రవీగుతూ ప్రత్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడటం పిరికిపంద చర్యగా ఆయన ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని,కాంగ్రెస్ నేతల దౌర్జన్యాలు రోజురోజుకూ శృతి మించుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. సోమార్‌పేట్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన బిట్ల బాలరాజు ఫలితాల అనంతరం తన కుటుంబ సభ్యులు,అనుచరులతో కలిసి ఇంటి ముందు కూర్చుని ఉన్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది.ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి, స్థానిక మండల అధ్యక్షుడు సాయిబాబా ట్రాక్టర్‌తో అక్కడికి వచ్చి బీభత్సం సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది, నన్ను ఎవరూ ఏం చేయలేరు" అంటూ విర్రవీగుతూ నిల్చున్న వారిపైకి ట్రాక్టర్ ఎక్కించి ఢీ కొట్టినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ దాడిలో బీఆర్ఎస్ అభ్యర్థి బిట్ల బాలరాజుతో పాటు ఆయన అనుచరులకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్పందించి వారిని ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.ఈ ఘటన విషయం తెలుసుకున్న వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఫోన్ చేసి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేసి, పార్టీ వారి వెన్నంటే ఉంటుందని, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. బాధితులకు అవసరమైన అన్ని సహాయాలు అందించాలని స్థానిక నాయకత్వాన్ని ఆదేశించారు. అనంతరం కేటీఆర్ కామారెడ్డి జిల్లా ఎస్పీకి స్వయంగా ఫోన్ చేసి సోమార్‌పేట్‌లో జరిగిన ఘటనను వివరించారు. అధికారముంది కదా అని కాంగ్రెస్ నేతలు హత్యాయత్నాలకు పాల్పడుతుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, అరెస్టులు చేయాలని కఠినంగా డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు తావివ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు కొనసాగితే బీఆర్ఎస్



శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజలు, కార్యకర్తలు తిరగబడే పరిస్థితి వస్తే శాంతిభద్రతల సమస్య తీవ్రరూపం దాల్చుతుందని, అప్పుడు ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ, గాడి తప్పిన కాంగ్రెస్ నేతలను కట్టడి చేయాల్సిన బాధ్యత పోలీసులదేనని తేల్చిచెప్పారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో చోటు చేసుకున్న ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.

# దోహాలో తెలుగు వారి సందడి - ఘనంగా "సాంస్కృతిక సమ్మేళనం"

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : ఖతార్ రాజధాని దోహాలో తెలుగు కళా సమితి "సాంస్కృతిక సమ్మేళనం" ఘనంగా జరిగింది. ఇండియన్ కల్చరల్ సెంటర్? ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా ఎంపికైన నూతన కార్యవర్గం ఈ కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత రాయబారి కార్యాలయంలో కమ్యూనిటీ విభాగాధిపతి వైభవ్ ఏ తాండలే, ఎపెక్స్ బాడీ అధ్యక్షులు ఏ.పీ. మణికంఠన్ - షాన్ వాస్ బావ -, అబ్దుల్ రెహ్మాన్ - హాజరయ్యారు. పండుగ వాతావరణం చూసి అతిథుల ఆనందం : పుట్టిన ఊరుకు దూరంగా ఉన్నా మాతృభాషను, సంప్రదాయాలను సంరక్షిస్తున్న తెలుగు సమాజానికి అతిథులు అభినందనలు తెలిపారు. పిల్లలు, యువత, పెద్దలు కలిసి ఒక కుటుంబంలా ఈ కార్యక్రమంలో పాల్గొనడం చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాలు భవిషత్?లో మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తుంటే అందరిలో కొత్త ఉత్సాహం వస్తుందని, సొంతవాళ్లకు దూరంగా ఉన్నామని బాధ పోతుందని వారు అభిప్రాయపడ్డారు. చివర్లో ఇంద్రజాల ప్రదర్శన ప్రత్యేక అక్షర్షణ : కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకునేలా సాగాయి. చిన్నారుల కూచిపూడి నృత్యంతో ప్రారంభమైన వేడుకలో జానపద నృత్యాలు, శాస్త్రీయ సంగీత



ప్రదర్శనలు, ఆధునిక నృత్యాలు వరుసగా ప్రేక్షకులను అలరించాయి. చివర్లో ఇంద్రజాల ప్రదర్శన ప్రత్యేక అక్షర్షణగా నిలచింది. చిన్నారుల నృత్యాలు, ఇంద్రజాల ప్రదర్శనను ప్రేక్షకులు ఆహ్వాదిస్తూ చప్పట్లతో ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఖతార్?లోని తెలుగువారు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ కల్చరల్ సెంటర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులైన శాంతను దేష్పాండే, అబ్రహం జోసెఫ్, ఆఫ్జాల్ అబ్దుల్ మాజిద్, ప్రదీప్ పిళ్ళై, బిశ్వజిత్ బెనెర్జీ, రాకేష్ వాఘ్, రవీంద్ర ప్రసాద్, సందీప్, వెంకప్ప, నందిని కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఉత్సాహపరిచారు. అంతే కాకుండా కమ్యూనిటీ పెద్దలు ప్రసాద్, కృష్ణ కుమార్, శంకర్ గౌడ్-, ఖాజా నిజాముద్దీన్-, అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్-, నరసింహం-, ప్రవీణ లక్ష్మి , రమేష్ అందరు విచ్చేసి ఈ కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చారు. ఇటువంటి కార్యక్రమాలు భవిషత్?లో మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. కొత్త కార్యక్రమాలను త్వరలో నిర్వహిస్తాం : విదేశాల్లో తెలుగు సంస్కృతిని నిలబెట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలుగు కళా సమితి అధ్యక్షుడు మలిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ ప్రకటించారు. మరో కొత్త కార్యక్రమాలను త్వరలో నిర్వహిస్తామని సభా వేదికగా ప్రకటించారు. సమయం తక్కువైనా, సంకల్పం బలంగా ఉంటే అసాధ్యం కూడా సుసాధ్యంగా మారుతుందని అన్నారు." "మాతృభూమికి దూరంగా ఉన్నా మా మూలాలను మర్చిపోలేదు. మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ ఖతార్?లో ఉన్న మేమంతా ఒకే కుటుంబం అనేలా ఈ వేడుక నిర్వహించాం. ఈ వేడుకను విజయవంతం చేసిన వారందరికి కృతజ్ఞతలు. రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాం. అందుకు మీ అందరి సహకారం కావాలి" - మలిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, తెలుగు కళా సమితి అధ్యక్షుడు ప్రేక్షకులకు హృదయపూర్వక ధన్యవాదాలు : ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన తెలుగు కళా సమితి కార్యవర్గ సభ్యులైన సత్యనారాయణ బుచ్చయ్య, సాహిత్య జ్యోత్స్న, హేమ సత్య రేఖ, నాయుడు, నరేష్ కుమార్, ప్రవీణ్ కుమార్, వెంకట నారాయణ రాజు, శంకర్?కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వాలంటీర్లకు, స్పాన్సర్లకు, ప్రేక్షకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# వ్యవసాయ వర్సిటీ ప్రగతి నివేదిక విడుదల

తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్స్ లర్ జిష్ణు దేవ్ వర్మను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సోమవారం లోక్ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ మల్లారెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పి జె టి ఏ యు ప్రగతి నివేదికను గవర్నర్ విడుదల చేశారు. పి జె టి ఏ యు సాధిస్తున్న ప్రగతిని గవర్నర్ అభినందించారు. ప్రవేశాల్లో వ్యవసాయ కూలీల పిల్లలకు 15 శాతం సీట్లు కేటాయించడాన్ని గవర్నర్ ప్రశంసించారు.



అదేవిధంగా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో పి జె టి ఏ యు 37వ ర్యాంకు నుండి 24 వ స్థానానికి ఎగబాకడంపట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మంచి పనితీరు కనపరచాలని, అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న మూడు బ్యాచ్ లకి కలిపి ఒకే స్నాతకోత్సవాన్ని ఫిబ్రవరి 2026 లో నిర్వహించడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా అల్దాస్ జానయ్య చేసిన విజ్ఞప్తిని గవర్నర్, ఛాన్స్ లర్ అంగీకరించారు. త్వరలోనే స్నాతకోత్సవం తేదీలను ఖరారు చేస్తామని హామీ ఇచ్చారు. 2026 ఫిబ్రవరిలో మూడు బ్యాచ్ లకు చెందిన 2800 యూజీ, పీజీ, పీహెచ్డీ విద్యార్థులకు గవర్నర్, ఛాన్స్ లర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పట్టాలు అందజేయనున్నట్లు అల్దాస్ జానయ్య తెలిపారు.

**సర్పంచ్ అభ్యర్థిపైకి ట్రాక్టర్ ఎక్కించి హత్యాయత్నం.. పిరికిపందలు అంటూ కేటీఆర్ ఫైర్**

# సంపాదకీయం

## జీవించి ఉండటానికి నన్ను నేను ఒప్పించుకునే ప్రయత్నం నా కవిత్వం

మనుష్యులు తమతమ రోజువారీ యుద్ధాలను దాటడానికి పోరాటం ఎంత ముఖ్యమో పోనివ్వాలనే చూపూ అంతే ముఖ్య మని తెలిసిన కవి బివివి ప్రసాద్. అందుకే గెలుపు జ్వరం పట్టిన లోకంలో, ఓడిపోవడానికే ఎక్కువ ధైర్యం కావాలని ఇప్పటికి ఎన్నో యేళ్ళ క్రితమే తన కవిత్వంలో చెప్పగలిగారు. లోపలి ప్రపంచంతో నిజాయితీగా సాగే సంభాషణల్లో, కొంత ఆనందమూ, కొంత దిగులూ, కొంత ఆశా కొంత వెలితీ అన్నీ తెరలు తెరలుగా తనలోనే వచ్చిపోవడం మనిషికి తెలుస్తుంది. ఆ ఉద్వేగాల ఉధృతిని అర్థం చేసుకునేందుకు ఉపకరించే తాత్విక అన్వేషణతోకూడిన కవిత్వం బివివి గారిది. లోపలి మనిషిపట్లా, లోకంపట్లా, దయాపూరితమైన చూపును, ఆలోచనను, మెలకువను ఈ కవిత్వంలో నేను చూశాను. సీతాకోక రెక్కల్లోని ఆశను, వర్షపు చినుకుల సంగీతాన్ని, వెన్నెలరాత్రుల నిశ్శబ్దంలోని గాఢమైన శాంతిని ఈ పదాల్లో నుండీ అందుకున్నాను. బివివి ప్రసాద్ కొత్త కవిత్వ సంపుటి 'సృష్టి' విడుదలైన సందర్భంగా ఆయనతో ఇంటర్వ్యూ.

'ఆకాశం' సంపుటితో మొదలై మీ కవిత్వ సంపుటుల్లో మీదైన శైలి ప్రస్ఫుటంగా కనపడుతూ వస్తోంది. దీని వెనుక ఉన్న సాధన, ప్రభావాలను చెప్పండి. 'ఆకాశం' రాసేనాటికి, శిల్పపరమైన ఎలాంటి కండిషన్ లేకుండా, నన్ను నేను వాక్యాల్లోకి తెరుచుకోవటం కొంత చాతనైంది అనుకుంటాను. అయితే నా వాక్యం నేను కనుగొనడానికి సహాయపడినవారు ముఖ్యంగా టాగోర్, ఖలీల్ జిబ్రాన్. పరమ ఉదాత్తమైనదాన్నే కవితా సమయంలో తాకాలని నేర్పారు వారు. తర్వాత ఇస్మాయిల్. కవిత్వంలోకి అనుభవాన్ని అనువదించడం, ప్రధానంగా, ఆయన నుండి వచ్చిందనుకుంటాను. మొదటి సంపుటి 'ఆరాధన'లోని కవితలలో ఏకరూప్యత లేకపోవటం గమనిస్తే, నాదైన వాక్యం కోసం తపన పడటం తెలుస్తుంది. 'నేనే ఈ క్షణం' సంపుటిలోని కవితల కాలంలోనే, విస్తృతంగా సాధన చేసిన హైకూ ప్రక్రియ నేర్పింది. గనుక జపనీయ కవుల ప్రభావం కూడా నా వాక్యాల్లో ఉండవచ్చును. శ్రీ రమణమహర్షి బోధించిన ప్రశ్న 'నేనెవరు' నా తాత్విక అన్వేషణకి మూలం. ఆ 'నేను'ను గురించి విస్తృతంగా, లోతుగా వివరించిన నిసర్గదత్త మహరాజ్‌ని చదవటం స్పష్టతనిచ్చింది. 'నేను'ను మరింత సూక్ష్మంగా బోధించినవారు శ్రీకాళహస్తిలోని సుబ్రహ్మణ్యంగారు. పూర్వ ఋషుల బోధలు, ఎకార్ట్ టోలీ వంటి ఆధునిక ద్రష్టల సూచనలు కూడా నా వెదుకులాటకి సహాయపడుతున్నాయి అనుకుంటాను. అయితే, అంతిమంగా ఎవరైనా తమదైన స్పష్టత, వెలుగు తామే పొందాల్సి ఉందనిపిస్తుంది. రూమి, టాగోర్ లాంటి తాత్వికకవుల్లో దైవం కోసం, దైవానుగ్రహం కోసం, సన్నిధి కోసం వెదుకులాట ఉంటుంది. మీ అన్వేషణకు దైవం కేంద్రం కాదు. ఎందుకు? పూర్వ తాత్వికకవులు సత్యాన్ని దైవంగా, గా, చూడబడేదిగా తలచటం ఎక్కువ, కొన్ని మినహాయింపులున్నా. సత్యం అని, చూసేవాడు అని, నేనే సత్యమని జ్ఞానులు చెబుతారు. కనక, నా ప్రయత్నమంతా నన్ను నేను తెలుసుకోవటం వైపే, నేను నేనుగా ఉండటం వైపే ఉంటుంది. రమణమహర్షి తనలో తాను సంస్థితం కావటం అంటారు. తెలియటం కూడా కాదు, అదిగా ఉండటం. అది సర్వ దర్శనాల లక్ష్యంగా తోచింది. ఒక ఆబ్జెక్ట్‌ని కవిత్వం చేయటంలో వెసులుబాటు ఉంటుంది. 'నేను'కీ ఆ వస్తువుకీ మధ్యనున్న ఖాళీలో ఎన్ని ఊహలైనా, నాటకీయత అయినా, ఎంత రసమైనా చొప్పించవచ్చును. కానీ 'నేను'ను కవిత్వం చేయటం దుస్సాధ్యం. కానీ, ప్రసాద్ అనే నేను, ఏమీకాని నేనుగా ఉండాలనుకున్నపుడు ఆ ప్రయత్నం, వెదుకులాట, దుఃఖం, ఆనందం కవిత్వంగా మారే వీలు కలుగుతుంది. ఆ చలనాలు కేవలం బౌద్ధికం కాకుండా, హృదయగతమైనప్పుడు అది కవిత్వంగా పండుతుంది. మీ కవితల్లో అధికభాగం 'నువ్వు' అని సంబోధిస్తూ రాస్తారు. దీనికేమైనా ప్రత్యేకమైన కారణం ఉందా? నా కవిత్వం నాతో నేను జరిపే సంభాషణ. కవిగా ఉన్న తాను, ఒంటరి తనతో జరిపే సంభాషణలో కవి, ఒంటరి మనిషిని ఉద్దేశించి చెబుతుంటాడు. ఈ ధోరణి ఉద్దేశపూర్వకంగా కాకుండా, సహజంగా నాలో ఏర్పడిందనుకుంటాను. గాఢమైన అనుభవంతో నిండిన ఒక మనిషి సాంత్వనగా పలుకుతున్న మాటల్లా వినపడుతుంది మీ కవిత్వం, అదే సమయంలో వాక్యాలు బోధ చేస్తున్నట్లు కూడా ఉండవు. ఇది ఎలా నిర్వహిస్తారు.

## ఆర్థిక అక్షరాస్యతా అవసరమే!



భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటింది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగానూ ఇండియా అవతరించింది. అయినాసరే చాలామందికి, ముఖ్యంగా యువతకు ఆర్థిక విషయాలపై సరైన అవగాహన(ఆర్థిక సాక్షరత) కొరవడుతోంది. డబ్బుతో కూడిన వ్యవహారాల్లో క్రమశిక్షణ, సహేతుకత అనేవి ఆర్థిక సాక్షరతలో అంతర్భాగం. సామాన్యులు తమ పేరిట తెరిచిన జన్‌ధన్ ఖాతాలను వినియోగించుకోవడం లేదంటే కారణం- వారికి సరైన అవగాహన లేకపోవడమే! 'ఆర్థిక సాక్షరత' అంటే డబ్బు సంపాదించడం, ఖర్చు పెట్టడమే కాదు- ఆర్థిక కార్యకలాపాలను చక్కగా నిర్వహించగలగడం కూడా. సరైన ఆర్థిక అవగాహన ఉన్నవారు బ్యాంకుల్లో డబ్బును పొదుపు చేయడంతో పాటు పనికొచ్చే కార్యక్రమాలకూ వృత్తి వ్యాపారాలకూ రుణాలు తీసుకుని ఎదుగుతారు. తద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపేణా ఆదాయమూ సమకూరుతుంది. కానీ, దేశంలో చాలామందికి... విద్యావంతులకు కూడా ఆర్థిక నిర్వహణ గురించి పెద్దగా తెలియదు. కేవలం మూడోవంతు మహిళలకే మదుపుచేసే అలవాటు ఉంది. జన్‌ధన్ ఖాతాలు ఉన్నా, చాలామంది వాటిని వినియోగించడం లేదు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు కూడా పిల్లలకు ఆర్థిక సాక్షరతను అలవర్చేందుకు అంతగా ప్రయత్నించడం లేదు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరముంది.

### అవగాహనతో పురోగతి...

కేంద్ర ప్రభుత్వం 2047 నాటికల్లా 'వికసిత భారత్'ను సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తెలుగు రాష్ట్రాలు సైతం ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ 2.4లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్షిస్తుంటే, తెలంగాణ మూడు లక్షల కోట్ల డాలర్లపై గురిపెట్టింది. ఏపీ తలసరి ఆదాయాన్ని 43వేల డాలర్లకు పెంచాలని ఆశిస్తుంటే, తెలంగాణ ఏమో కోటి కుటుంబాలను కోటీశ్వరులను చేయాలని భావిస్తోంది. పేదరిక నిర్మూలనకు ఏపీ 'పీ-4' పథకంతో ముందుకు సాగుతోంది. ఈ లక్ష్యాలను సాధించడానికి పెట్టుబడులు, మౌలిక వసతులు సమకూర్చుకోవడంతోపాటు ప్రజలకు ఆర్థిక సాక్షరతను అలవరచడమూ ఎంతో ముఖ్యం. నేటి కాలంలో ప్రజల అవసరాలు పెరిగాయి. దీర్ఘకాలంలో వాటిని తీర్చుకోవడానికి పొదుపు-మదుపు ముఖ్యం. కాబట్టి ఆర్థిక మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిస్క్‌ను సరిగ్గా అంచనావేస్తూ మదుపు చేయడం గురించి వారికి తెలియజెప్పాలి. ఎలాంటి పద్ధతులను అనుసరించాలి, ఏయే పథకాల్లో చేరాలి అనేది సామాన్యులకు వివరించాలి. స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వ పథకాలు, సంపదను వృద్ధి చేసుకునే మార్గాల గురించీ తెలియజెప్పాలి. ఇదంతా ఆర్థిక సాక్షరతలో భాగమే. సుమారు 80శాతం మంది అక్షరాస్యులు ఉన్న భారతదేశంలో 75శాతం మంది వయోజనులకు ఆర్థిక అంశాలపై సరైన అవగాహన లేదనీబీ మరీ ముఖ్యంగా 80శాతం మహిళలకు బొత్తిగా ఆర్థిక సాక్షరత లేదని స్టాండర్ట్ అండ్ పూర్స్ నివేదిక వెల్లడించింది. ఆర్థిక సంస్థలు అందించే పొదుపు, మదుపు, రుణ, బీమా పథకాల గురించి సమాజంలోని అన్ని వర్గాలకూ అవగాహన ఉండటం ముఖ్యమని రిజర్వ్ బ్యాంకు పేర్కొంది. అందునా అల్పాదాయ, బలహీన వర్గాలకు వీటిపై అవగాహన పెంచడంతో పాటు స్వల్ప వడ్డీపై రుణాలిచ్చి వారి ఆర్థిక పురోగతికి చేయూతనివ్వాలని రంగరాజన్ కమిటీ గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. నగరాలు, పట్టణాల్లో పొదుపు, పెట్టుబడి, బ్యాంకింగ్ గురించి అవగాహన ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలకు బ్యాంకు ఖాతాలు తెరిచి చిన్ననాటి నుంచే వారితో చిన్న చిన్న మొత్తాలను పొదుపు చేయిస్తున్నారు. కిడ్డీ బ్యాంక్, జూనియర్స్ అకౌంట్ వంటి వాటిని ఇక్కడ ప్రస్తావించాలి. చిన్న పట్టణాలు, పల్లెలు, ఆదివాసీ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఈ అంతరాన్ని వెంటనే సరిదిద్దాలి. పదేళ్ల వయసు నిండి, 6-10 తరగతుల్లో ఉన్న విద్యార్థులంతా బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరిచేలా చర్యలు తీసుకోవాలి. వారికి లభించే ఉపకార వేతనాలు, వేర్వేరు ప్రభుత్వ పథకాల ద్వారా అందే నగదు ప్రయోజనాలను వాటిలోనే జమ చేయాలి. పొదుపు-మదుపు ఎంత ముఖ్యమో వారికి అర్థమయ్యేలా తెలియజెప్పాలి. మరో అయిదేళ్లలో అందరికీ నాణ్యమైన విద్యను అందించాలని ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన నాలుగో సుస్థిరాభివృద్ధి లక్ష్యం చెబుతోంది. అందులో భాగంగానే పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఆర్థిక సాక్షరత అలవరచాలి. కేంద్రం నెలకొల్పిన జాతీయ ఆర్థిక విద్యా కేంద్రం(ఎన్‌సీఎఫ్ఈ) ఆర్థిక సాక్షరతను పెంపొందించడానికి కృషి చేస్తోంది. దీనికి రిజర్వు బ్యాంకుతో పాటు సెబీ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ, పింఛన్ నియంత్రణ సంస్థల దన్ను ఉంది.

### బాల్యం నుంచే నేర్పించాలి...

ఎన్‌సీఎఫ్ఈ 2019లో నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. దేశంలో ఆర్థిక సాక్షరత 27శాతం ఉంటే, మహిళల్లో అది 21శాతమేనని తేలింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమల్లో స్త్రీలు 20శాతమే ఉన్నట్లు గుర్తించారు. పేద, బలహీన వర్గాలకు ఆర్థిక సాక్షరత ఉంటే... ప్రభుత్వం నుంచి నేరుగా సాయం పొందడమెలాగో వారికి అర్థమవుతుంది. తద్వారా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన పథకాలు, ఆర్థిక సేవలు మరింతగా విస్తరిస్తాయి. క్రమంగా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యమూ పెరుగుతుంది. వికసిత భారతం, స్వర్ణాంధ్ర, తెలంగాణ రైజింగ్ సంకల్పాలు సాకారమవ్వాలంటే సమాజంలోని అన్ని వర్గాలనూ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక సాక్షరత సాధనకు ప్రత్యేక సంస్థల ఏర్పాటు అత్యావశ్యకం. వాటి ఆధ్వర్యంలో విద్యా, వ్యవసాయ, కార్మిక శాఖలు... రైతు సంఘాలు, నెహ్రూ యువకేంద్రాలు కలిసికట్టుగా ఆర్థిక సాక్షరత సాధనకు కృషి చేయాలి. రిజర్వు బ్యాంకు, నాబార్డ్‌ల సహకారాన్నీ తీసుకోవాలి. ప్రభుత్వాలు 'నేటి బాలలే రేపటి పౌరుల'ని గుర్తుంచుకుని, వారిని ఇప్పటి నుంచే వికసిత భారత్ సాధనలో భాగస్వాములను చేయాలి.

## అలాంటి ఫ్రెండ్స్... మీకున్నారా?

మంచి స్నేహితులను ఎంచుకోవాలని పిల్లలకు తల్లిదండ్రులు చెబుతుంటారు. నిజానికి ఆ వయసులో ఎవరు మంచో ఎవరు కాదో అర్థం కాదు. పాఠశాల నుంచి కళాశాల స్థాయికి ఎదిగే క్రమంలో మంచీ చెడుల పట్ల కొంత అవగాహన పెరుగుతుంది. మనకు తెలియకుండా మనమే మనలాగా ఆలోచించేవారికి దగ్గరగా, వ్యతిరేక భావజాలం ఉన్నవారికి దూరంగా జరగడం ప్రారంభిస్తాం. ఇద్దరు వ్యక్తుల మధ్య మైత్రికి రెండుపక్కల నుంచి సమ ప్రాధాన్యం లభిస్తేనే అది విడదీయరాని బంధమవుతుంది. అయితే ఈరోజుల్లో ఇలాంటి గాఢమైన మైత్రీబంధాలు అరుదుగా మాత్రమే కనిపిస్తున్నాయి. మనకు పరిచయస్తులు ఎక్కువగానే ఉంటున్నారు కానీ, 'స్నేహితులే' తక్కువగా ఉంటున్నారు. ఆ మధ్య అమెరికాలో ఈ స్నేహాల మీద చాలా అధ్యయనాలు జరిగాయి. మిత్రులు తగ్గిపోయి, ఒంటరితనంతో బాధపడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతున్నట్లు ఈ అధ్యయనాలు తేల్చాయి. ఒంటరితనం వ్యక్తుల మానసిక, శారీరక ఆరోగ్యాలమీద, సామాజిక జీవితం మీద ఎన్నో దుష్ప్రభావాలు చూపుతుంది. అది తెలుసుకున్న స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు ఆరోగ్యకరమైన స్నేహాలను ఎలా పెంచుకోవాలో చెబుతూ ఒక కోర్సును కూడా అందిస్తున్నారు. ఇది చాలదూ నిజమైన స్నేహాల అవసరం ఎంత ఉందో చెప్పడానికి? స్నేహానికి ఆరోగ్యకరమైన సంభాషణ పునాది వేస్తుంది. ఇందులో వినడం, మాట్లాడటం రెండింటికీ సమప్రాధాన్యం ఉండాలి. సంభాషణను వాగ్వాదంగా మార్చకుండా చర్చగా మాత్రమే కొనసాగించగలగాలి. నేటి సమాజంలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం క్లిష్టమైన సమస్యగా మారింది. సహానుభూతితో కూడిన స్నేహం అందుకు దోహదపడుతుంది. ఒకప్పుడు కలం స్నేహాల్లో వ్యక్తుల మధ్య అరమరికలు లేకుండా అభిప్రాయాలను పంచుకునేవారు. సాంకేతికత పెరిగి, సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చాక అపరిచితులతో కొత్త స్నేహాలు ఏర్పడుతున్నాయి. కలం స్నేహంలో కూడా అటువంటివే ఏర్పడినా మోసాలు, బ్లాక్‌మెయిలింగ్ లాంటి వాటికి తావుండేది కాదు. కానీ ఇప్పటి స్నేహాలు అంత నమ్మశక్యమైనవిగా ఉండటం లేదని జరుగుతున్న సంఘటనలు తెలియజేస్తున్నాయి. ఆరోగ్యకరమైన స్నేహానికి ఎనిమిది ప్రధానమైన అంశాలు తోడ్పడతాయి. పరస్పర నమ్మకం కలిగి ఉండాలి. అవసరమైన సందర్భాల్లో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ప్రదర్శించాలి. అభిప్రాయాలనూ ఆలోచనలనూ స్పష్టంగా వ్యక్తీకరించాలి. ఒకరినొకరు గౌరవించుకుంటూ, స్నేహబంధంలోనూ ఎవరి స్పేస్ వారికి ఇవ్వాలని తెలుసుకుని ప్రవర్తించాలి. దయా సానుభూతి కలిగి ఉండాలి. అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు సంయమనంతో వ్యవహరించాలి. బయటి నుంచి ఎదురైన సమస్యలను కలిసి పరిష్కరించుకోవాలి. చివరిది అన్నింటికన్నా ముఖ్యమైనది ఏ స్నేహమైనా హానికరంగా తయారైనప్పుడు దాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలి. శ్రీశ్రీ అన్నట్లు- నిన్ను నిన్నుగా ప్రేమించడానికే కాదు స్నేహించడానికి కూడా ఒకరు ఉండటం మహద్భాగ్యమే!



## రూపాయి క్షీణత ఎంతదాకా?



డాలర్‌తో రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేనంతగా 90 రూపాయలకు పడిపోయింది. దీనివల్ల దేశార్థికంపై ప్రతికూల ప్రభావం ప్రసరిస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదెంతవరకూ నిజం? రూపాయిని మనమెలా బలోపేతం చేసుకోగలం? భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.30 రూపాయలు. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చిన తరవాత రూపాయి తన విలువను వేగంగా కోల్పోయింది. నిరుడు 83 రూపాయల దగ్గర కొనసాగిన రూపాయి విలువ- ఇప్పుడు 90రూపాయలకు పడిపోవడం ఆర్థికవేత్తలను విస్మయపరుస్తోంది. సర్కారీ వర్గాలు మాత్రం ఆందోళనేమీ అక్కర్లేదని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. డాలర్ బలపడటంవల్లే రూపాయి మారకపు విలువ తగ్గిందిగానీ, రూపాయి బలహీనపడలేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు.

### ఒత్తిడి ఎందుకు పెరుగుతోంది?

ఆసియాలోని మిగతా దేశాలతో పోలిస్తే మన రూపాయే ఎక్కువగా ప్రభావితమవుతుంటుంది. ఇందుకు ప్రధాన కారణం- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వాణిజ్య నిర్ణయాలూ, ప్రతీకార సుంకాలే. మరోవైపు డాలర్ బలోపేతానికి అమెరికా ఫెడరల్ రిజర్వ్ కూడా కొన్ని చర్యలు తీసుకుంటోంది. న్యూదిల్లీ-వాషింగ్టన్ వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడటం, భారతీయ ఎగుమతులపై అగ్రరాజ్యం 50శాతం సుంకాలు విధించడం... విదేశీ మదుపరులు 17బిలియన్ డాలర్ల దాకా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం, డాలర్ కొనుగోలుకు మదుపరులు ఎగబడటం వంటి వరుస పరిణామాలతో డాలర్‌కు డిమాండ్ పెరిగింది. దాంతో రూపాయి మారకం విలువ పడిపోయింది. ఇప్పుడు రూపాయి క్షీణించడం గురించి భిన్న వాదనలు, రాజకీయ విమర్శలెన్నో వినిపిస్తున్నాయి. వాటిని పక్కనపెడితే, రూపాయి విలువ పతనం ఇప్పటికిప్పుడు ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రతికూల ప్రభావమేదీ చూపకపోవచ్చు. కానీ, దీనివల్ల దీర్ఘకాలంలో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయన్న సూచనలైతే కనిపిస్తున్నాయి. ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వమే స్వచ్ఛందంగా రూపాయి విలువను తగ్గిస్తే(డీవాల్యుయేషన్) కొన్ని రంగాల్లో అనుకూల ఫలితాలు వస్తాయి. 1966లో ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికీ, 1991లో విదేశీ మారకద్రవ్య నిల్వల లోటును అధిగమించడానికీ ఇలాగే చేశారు. ఇప్పుడు మార్కెట్ శక్తుల ప్రభావం వల్ల రూపాయి విలువ పతనమవుతోంది కాబట్టి- ప్రతికూల ఫలితాలే ఎక్కువగా రావచ్చు. జేపీ మోర్గాన్ ఇండియా చీఫ్ సాజిత్ చినోయ్ చెబుతున్నట్లు- ప్రపంచవ్యాప్తంగా భారతీయ వస్తువులు చౌకగా మారడానికీ, దిగుమతులు భారంగా మారి దేశీయ తయారీదారులకు తోడ్పడటానికీ, ఉద్యోగాల సృష్టికీ, చైనా వస్తువులకు అడ్డుకట్ట వేయడానికీ రూపాయి విలువ తగ్గడం కొంతవరకు ఉపయోగపడుతుంది. కానీ, ఇదంతా పరిమితంగానే ఉంటుంది. ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే- రూపాయి విలువ తగ్గినప్పుడు ధరలు పెరుగుతాయి. అంటే, ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. దానివల్ల ప్రజల కొనుగోలుశక్తి, వస్తువులకు డిమాండ్ తగ్గిపోతుంది. పెట్టుబడులూ ఉద్యోగావకాశాలూ తగ్గిపోతాయి. అయితే, ప్రభుత్వం ఇటీవల జీఎస్‌టీ శ్లాబులు తగ్గించడం, ఆర్‌బీఐ ద్రవ్యవిధానం పరిస్థితిని కొంతవరకు సరిదిద్దగలుగుతాయి. సహజంగా రూపాయి విలువ క్షీణత ఎగుమతులను ప్రోత్సహించి, దిగుమతులను నిరుత్సాహపరుస్తుంది. దీనివల్ల విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో అనుకూలత ఏర్పడుతుంది. కానీ, ట్రంప్ సుంకాల పెంపు వల్ల రూపాయి విలువ తగ్గినా, ఎగుమతుల రంగంలో రావాల్సిన అనుకూలత రాకుండా పోయే ప్రమాదముంది. ఇండియా 85శాతానికి పైగా చమురు, 60శాతం వంట నూనెలతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎరువులు, రసాయనాలు, యంత్రాలు వంటి వాటిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఇప్పుడు రూపాయి విలువ క్షీణించడం వల్ల వీటి ధరలు పెరగవచ్చు. ద్రవ్యోల్బణం తరహా పరిస్థితులు రవాణా వ్యవస్థపైనా, తద్వారా దేశార్థికంపైనా ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

### మన కరెన్సీ బలపడే మార్గమేంటి?

రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోవడానికి రిజర్వుబ్యాంకు చేపట్టే వడ్డీ రేట్ల పెంపు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ వంటి చర్యలు తాత్కాలిక ఉపశమనం కలిగిస్తాయి. అయితే, విదేశీ మదుపరుల్లో విశ్వాసం కలిగించడం, దిగుమతులను తగ్గించుకోవడం, దేశీయ ఉత్పత్తులకు గిరాకీ పెంచడం, రష్యా సహా ఇతర భాగస్వామ్య దేశాలతో సొంత కరెన్సీలో వ్యాపారం చేయడం, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులను ఆకర్షించడం వంటివి ఎంతైనా అవసరం. విదేశీ మారకద్రవ్య నిల్వలనూ...పొదుపు- మదుపు- వినియోగాన్ని పెంచడం ద్వారా దేశార్థికాన్నీ, రూపాయినీ బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించాలి. భవిష్యత్తులో భారత్ గణనీయమైన వృద్ధిరేటును సాధించి, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా- రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని గుర్తుంచుకోవాలి!

**డాక్టర్ తిరునహరి శేషు, ఆర్థిక నిపుణులు**

ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో సాయుధ సంఘర్షణలు శాంతిని నీరుగారుస్తున్నాయి. ఆఫ్రికాలో ఖండంలోని బుర్కినా ఫాసో, మాలి, నైగర్, ఇథియోపియా, సోమాలియా, దక్షిణ సూడాన్, సూడాన్, డీఆర్ కాంగో వంటి చోట్ల ఏళ్లుగా సాయుధ ఘర్షణలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాలోని సిరియా, యెమెన్, ఇరాక్, ఇజ్రాయెల్, గాజాల్లోనూ అవి రావణకాష్ఠాలు రగిలిస్తున్నాయి. ఆసియాలోని మయన్మార్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్, ఐరోపాలోని అర్మీనియా, అజర్‌బైజాన్‌బీ అమెరికా ఖండాల్లోని కొలంబియా, మెక్సికో, హైతి వంటి చోట్ల సాయుధ ఘర్షణలు నెత్తుటి నెగళ్లు రాజేస్తున్నాయి. వీటి మూలంగా 1989-2024 మధ్య 39 లక్షల మంది చనిపోయారు.

## సీఐటీయూ జాతీయ 18వ మహా
# సభలు జయప్రదం చేయండి...
### సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి...




గోదావరిఖని.**ఆకాంక్ష డిసెంబర్ 15:** సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు అఖిల భారత కమిటీ ఇచ్చిన పిలుపులో గోదావరిఖని పట్టణంలో కార్యకర్తలు, నాయకుల ఇండ్ల మీద మరియు సింగరేణిలోని అన్ని మైన్ల మీద ఇతర కార్మికుల అడ్డాల వద్ద సిఐటియూ జెండాలు ఆవిష్కరణలు చేసి అనంతరం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో ఉన్న శ్రామిక భవన్ లో జెండా ఆవిష్కరణ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల మీద దాడి మొదలు పెట్టిందని అన్నారు. పెట్టుబడి దారులకు అనుకూలంగా కార్మిక చట్టాలు అన్నిటిని మార్చి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చిందని దీన్ని అమలు చేయడానికి ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకు వస్తున్నారని అన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. నాలుగు లేబర్ కోడ్లు అమలు అయితే భారత కార్మిక వర్గం మొత్తం బానిసత్వంలోకి పోయే ప్రమాదం ఉందని అన్నారు. లేబర్ కోడ్లు రద్దు కోసం భారత కార్మిక వర్గం మొత్తం ఏకతాటి మీదికి వచ్చి పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. సిఐటియు అఖిలభారత మహాసభల్లో తీసుకునే తీర్మానాలు,కర్తవ్యాల అమలుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని అన్నారు. రైతుల ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని కార్మిక వర్గం మొత్తం నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోడీ తన విధానాలను మార్చుకొని నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా నరేంద్ర మోడీ ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెండే శ్రీనివాస్ గోదావరిఖని పట్టణ కార్యదర్శి మేదరి సారయ్య,నాయకులు, కార్యకర్తలు శివరాం రెడ్డి, రమేష్, మధు,మల్లేష్, సమ్మయ్య, సారయ్య, ఆంజనేయులు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓసీపీ -1 సిహెచ్ పీలో రక్షణ
## పక్షోత్సవాలు...అలరించిన లఘునాటిక...
### సింగరేణి కళాకారుడు రాధాకృష్ణకు సన్మానం...





గోదావరిఖని. **ఆకాంక్ష డిసెంబర్ 15:** సింగరేణి 56వ రక్షణ పక్షోత్సవాలలో భాగంగా ఈ అండ్ ఎం అడిషనల్ జిఎం జి.కృష్ణమూర్తి నేతృత్వంలోని రక్షణ కమిటీ బృందం సోమవారం ఆర్జీ-3 ఏరియా ఓసీపీ -1 సిహెచ్ పిని సందర్శించింది. ఈ సందర్భంగా గనిపై ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ వి ఫాటింగ్, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఓసీపీ -1 సిహెచ్ పీలో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ, గణనీయమైన స్థాయిలో డిస్పాచ్ చేస్తూ రికార్డ్ సృష్టించిందన్నారు. రక్షణ కమిటీ బృంద కన్వీనర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సిహెచ్పి కార్మికులు గత కొన్ని సంవత్సరాలుగా అన్ని విభాగాలలో ఉత్తమ నైపుణ్యం కనపరుస్తున్నారని, ఇదే సంస్కృతిని కొనసాగిస్తూ రక్షణతో పని చేయాలని సూచించారు. అనంతరం గని కార్మికులు రాధాకృష్ణ, రమేష్, రాజు, జగదీశ్, చంద్రపాల్ బృందం ప్రదర్శించిన లఘు నాటిక 'మన రక్షణ-మన బాధ్యత' ఆహూతులను ఆకట్టుకోగా, మహిళా కార్మికురాళ్ళు సిపిఆర్ చేయవలసిన విధానాన్ని ప్రదర్శించారు. కాగా ఈ సిహెచ్పి లో విధులు నిర్వహిస్తూ త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న సింగరేణి కళాకారుడు కొండ్ర రాధాకృష్ణను కళాకారులు, అధికారుల పక్షాన ఘనంగా సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిహెచ్పి ఉన్నతాధికారి కాశీ విశ్వేశ్వర్ రావు, అధికారులు ఉదయ్ భాస్కర్, గని మేనేజర్ పాపయ్య, రక్షణాధికారి అజయ్ కుమార్, శ్రీనివాస్ తోపాటు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మురళీ కృష్ణ, డి.తిరుపతిరావు, జి.తిరుపతి, గంధం శ్రీనివాస్, కిషన్ నాయక్, సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల
## నేపథ్యంలో 163 బీఎన్ఎస్ఎస్ అమలు...




గోదావరిఖని. **ఆకాంక్ష డిసెంబర్ 15:** రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఫేజ్ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ ఉత్తర్వులను అమలు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు.ఈ మేరకు రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లోని సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల మండలాలతో పాటు మంచిర్యాల జోన్ పరిధిలోని భీమారం, చెన్నూర్, జైపూర్, కోటపల్లి, మందమర్రి మండలాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ఈ ఉత్తర్వులు అవసరమని పేర్కొన్నారు.సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ ప్రకారం ఆయా మండలాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకే చోట గుమిగూడరాదని, చట్టబద్ధమైన సమావేశాల నిర్వహణకు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని పోలీస్ శాఖ స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులు డిసెంబర్ 15 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 17 వరకు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తై ఫలితాలు ప్రకటించే వరకు అమలులో ఉంటాయని తెలిపారు.ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమీషనర్ హెచ్చరించారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎన్నికల
# నియమావళి పకడ్బందీ అమలు..
### 98 కేసుల్లో 1525 లీటర్ల అక్రమ మద్యం సీజ్...
### రూ.23.28 లక్షల నగదు స్వాధీనం..జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల. **ఆకాంక్ష డిసెంబర్ 15:** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై మొత్తం 11 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.ఎన్నికల సమయంలో అక్రమ మద్యం విక్రయం, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పోలీస్ శాఖ ఆకస్మిక దాడులు నిర్వహించిందని ఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో 98 కేసులు నమోదు చేసి, మొత్తం 1525 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేయడంతో పాటు రూ.23,28,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.అలాగే ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపై ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో 224 కేసుల్లో 782 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు.ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రజలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ, స్వేచ్ఛాయుతంగా, శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి మురళీ
## కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్...



రాజన్నసిరిసిల్ల. **ఆకాంక్ష డిసెంబర్ 15:** వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణాలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో గుండె పోటుతో మృతి చెందిన బీఆర్ఎస్ అభ్యర్థి మురళీ కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. మురళీ నివాసానికి వెళ్లిన కేటీఆర్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మురళీ అకాల మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్న కేటీఆర్, ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు ఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అమృత్ 2.0 పనులు త్వరితగతిన పూర్తి చేయాలి...
### మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ సెక్రటరీ శ్రీదేవి...
### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష...
### హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్....

రాజన్న సిరిసిల్ల. **ఆకాంక్ష డిసెంబర్ 15:** అమృత్ 2.0 కింద చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏ%డ%యూడీ) సెక్రటరీ శ్రీదేవి అధికారులను ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్ లోకల్ బాడీల పరిధిలో అమలవుతున్న అమృత్ 2.0 పనుల పురోగతిపై సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ పనుల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఏ%డ%యూడీ సెక్రటరీ శ్రీదేవి మాట్లాడుతూ, పనులన్నింటినీ ప్రణాళికాబద్ధంగా చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగాన్ని పెంచేందుకు అవసరమైన సామగ్రి ముందుగానే సమకూర్చుకోవాలని, తగిన సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. అమృత్ 2.0 పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో అమృత్ 2.0 కింద సిరిసిల్ల నియోజకవర్గంలో రూ.100 కోట్ల నిధులతో నీటి ట్యాంకులు, పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయని, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలో రూ.13 కోట్లతో చేపట్టిన అమృత్ 2.0 పనుల పురోగతిని అభినందించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, పబ్లిక్ హెల్త్ డీఈ వరుణ్, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రేపటినుండి రామాలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు....
### ఈనెల 30న వైకుంఠ ఏకాదశి, 11 జనవరి కుడారై ప్రసాదం...
### 15 జనవరి గోదాదేవి కల్యాణోత్సవం....



నాగర్ కర్నూల్**ఆకాంక్ష డిసెంబర్ 15:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు 1972 నుండి ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.ఈ సంవత్సరం ఈనెల 16న రేపటినుండి జనవరి 14 వరకు ప్రతిరోజు ప్రత్యేకంగా నిర్వహిస్తునట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. ధనుర్మాస ప్రత్యేక పూజలలో ప్రతిరోజు సుప్రభాత సేవ ఆరాధన, వేద మూర్తులైన బ్రాహ్మణులచే పాశుర పఠనం, తిరుప్పావై సేవా కాలం, సత్యసాయి సేవా సమితి నాగర్ కర్నూల్ వారిచే ప్రత్యేక భజనలు, ప్రత్యేక తీర్థప్రసాదాల పంపిణీ, సామూహిక కుంకుమార్చన, గోదామాతకు పుష్పాభిషేకం, భక్తుల గోత్రనామాలతో అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం నాడు ప్రారంభం కావడంతో సాయంత్రం 6 గంటలకు ధనుర్మాసపు ప్రత్యేక పూజలు ప్రారంభించి,పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ ప్రాంత భక్తులు ధనుర్మాస ప్రత్యేక పూజలలో పాల్గొని గోదాదేవి అమ్మవారి యొక్క కృపాకటాక్షాలు విశేషంగా పొందాలని ఆయన కోరారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులకు ప్రత్యేక ప్రసాదాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.భక్తులు ధనుర్మాస పూజలకు రామాలయ ప్రధాన అర్చకులను నేరుగా లేదా 9440981253 లో సంప్రదించాలని ఆయన కోరారు.

## గెలిచిన సర్పంచ్‌పై వేట కొడవలితో దాడికి యత్నం...

ఆసిఫాబాద్**ఆకాంక్ష డిసెంబర్ 15:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం ఇటిక్యాల పహాడ్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల అనంతరం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో ఓటమిని తట్టుకోలేక ఓడిపోయిన అభ్యర్థి గెలిచిన సర్పంచ్‌పై వేట కొడవలితో దాడికి యత్నించిన ఘటన గ్రామంలో కలకలం రేపింది.వివరాల ప్రకారం ఇటిక్యాల పహాడ్ గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తనుబాయి విజయం సాధించారు. ఫలితాలు వెలువడిన తరువాత గ్రామంలో ఆనందోత్సాహాలు కొనసాగుతుండగా, ఓటమిపాలైన కాంగ్రెస్ అభ్యర్థి భీంరావు ఆగ్రహంతో గెలిచిన సర్పంచ్ తనుబాయి భర్త పోశెట్టిపై వేట కొడవలితో దాడికి యత్నించినట్లు తెలుస్తోంది. అకస్మాత్తుగా జరిగిన ఈ ప్రయత్నంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ దాడిని గమనించిన గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై భీంరావును అడ్డుకున్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా అతడిని చితకబాది, తాడుతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. దాడి ప్రయత్నంలో పోశెట్టికి ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని స్థానికులు తెలిపారు. ఘటన సమయంలో గ్రామంలో ఉన్న ప్రజలు పెద్ద సంఖ్యలో చేరడంతో పరిస్థితి తీవ్రంగా మారింది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ ప్రారంభించారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా గ్రామంలో పోలీసు బందోబస్తును పెంచినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఎన్నికల ఫలితాలను శాంతియుతంగా స్వీకరించాల్సిన అవసరం ఉందని, హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గ్రామంలో ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

## నాగర్ కర్నూల్ పట్టణంలో
# ఘనంగా అయ్యప్ప శోభాయాత్ర...



నాగర్ కర్నూల్. **ఆకాంక్ష డిసెంబర్ 15:** నాగర్ కర్నూలు పట్టణంలో అయ్యప్ప స్వామి శోభాయాత్ర భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సీతారామస్వామి దేవస్థానం నుంచి కలశం, అయ్యప్ప స్వామి విగ్రహం, తిరు ఆభరణాలతో ప్రారంభమైన శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా మేళతాళాల నడుమ సాగింది. డప్పులు, చప్పట్లు, భజనల నినాదాలతో పట్టణమంతా భక్తిమయంగా మారింది.అయ్యప్ప స్వాముల బృందాలు కోలాటాలు, నృత్యాలతో ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొనగా, మహిళలు భక్తిగీతాలు ఆలపిస్తూ స్వామివారికి హారతులు ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శోభాయాత్రను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శాంతిభద్రతల మధ్య కొనసాగిన ఈ శోభాయాత్ర శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప సన్నిధానం వరకు చేరి భక్తిపూర్వకంగా ముగిసింది.

## కేసీఆర్ చుట్టూ కొన్ని 'కొరివి దెయ్యాలు...
### అతిపెద్ద 'కొరివి దెయ్యం' పల్లా రాజేశ్వరరెడ్డి...
### ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆరోపణలు...



జనగాం.**ఆకాంక్ష డిసెంబర్ 15:** జనగాం జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ కీలక నేత పల్లా రాజేశ్వరరెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ చుట్టూ కొన్ని 'కొరివి దెయ్యాలు' ఉన్నాయని ఎమ్మెల్సీ కవిత చెబుతున్నారని, వాటిలో అతిపెద్ద కొరివి దెయ్యం పల్లా రాజేశ్వరరెడ్డేనని కడియం శ్రీహరి ఆరోపించారు.కల్వకుంట్ల కుటుంబంలో చేరి కుట్రలు పన్నుతూ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాడని, అందుకే కవిత బీఆర్ఎస్‌కు దూరమయ్యారని పేర్కొన్నారు. పల్లా రాజేశ్వరరెడ్డి కారణంగానే కేటీఆర్, హరీశ్‌రావు మధ్య కూడా గ్యాప్ వచ్చిందని ఆరోపించారు. పార్టీ అంతర్గత విభేదాలకు మూలకారణం పల్లానేనని స్పష్టం చేశారు.స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి రాజయ్య కంటే ఎక్కువ గ్రామాల్లో పల్లా రాజేశ్వరరెడ్డి ప్రచారం చేసినట్లు తనకు తెలిసిందన్నారు. రాజయ్య తిరిగితే ఓట్లు రావని భావించి, ఆయన్ను రాజకీయంగా జీరో చేయాలనే ప్రయత్నం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాజయ్య ఇప్పటికైనా కళ్లు తెరిచి తనను విమర్శించడం మానుకుని, తన పార్టీలో తనపై జరుగుతున్న కుట్రలను గ్రహించాలని కడియం శ్రీహరి సూచించారు. బీఆర్ఎస్‌లో అంతర్గత రాజకీయాలు ప్రజల ముందుకు వస్తున్నాయని, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ తోనే పల్లె ప్రగతి సాధ్యమవుతుంది..
### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు...



పెద్దపల్లిబ్యూరో.**ఆకాంక్ష డిసెంబర్ 15:** పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి గడపగడపకు వెళ్తూ బ్యాలెట్ నమూనాను చూపిస్తూ కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ తోనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు మరింత అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చునని దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకేదక్కుతుందన్నారు. పెద్దపల్లి మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఆర్థికంగా వొడిదుడుకులను ఎదుర్కొంటూనే అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు ఉచిత కరెంటు, రెండు లక్షల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పథకం 10 లక్షలకు పెంపు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ, సన్నవడ్లపై బోనస్, కటింగ్ లు లేకుండా వడ్ల కొనుగోలు, మానేరు నుండి ఇసుక పంపిణీ సులభతరం, లారీలో ఇసుక తరలింపు నిలిపివేసి భూగర్భజలాల పెంపుకు రైతులకు పరోక్ష సహాయం వంటి ఎన్నో ప్రజా ఉపయోగ పనులను తాము అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తించి ఎన్నికల్లో తాము బలపరిచే అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. బస్సు డిపో ఏర్పాటు పెద్దపల్లి ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన యువ వికాస పబ్లిక్ మీటింగ్ కు వచ్చిన సందర్భంగా పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటుకు జీవో ఇచ్చారని తెలిపారు. బస్సు డిపో నిర్మాణం కోసం భూమి పూజ చేసి పనులు ప్రారంభించు కోవడం జరిగింది. 6 నుండి 8 నెలల్లో డిపో పూర్తి చేసి, ఇక్కడి నుండే బస్సులు నడిచే విధంగా ప్రణాళిక చేయడం జరిగిందని అన్నారు.

## నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం..
# మళ్లీ జైలుకు ఆ నలుగురు

నకిలీ మద్యం కేసు లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మరింత సమాచారం రాబట్టేందుకు నలుగురు నిందితులను ఐదురోజుల పాటు ఎక్సైజ్ అధికారులు జైలుకు తరలించాలని విజయవాడ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నలుగురు నిందితులను తిరిగి జైలుకు తరలించారు. కాగా నకిలీ మద్యం కేసులో కట్టారాజు, సయ్యజ్ హాజీ, అంథా దాస్, మిథన్ దాస్ నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. అయితే వీరి నుంచి మరిన్ని ఆధారాలు సేకరించేందుకు కస్టడీకి ఇవ్వాలని అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ నలుగురు నిందితులను ఐదు రోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతించింది. ఈ మేరకు నిందితులను ఐదు రోజులు పాటు విచారించారు. వారి చెప్పిన సమాధానాలను రికార్డు చేశారు. ఐదు రోజుల కస్టడీ ముగియడంతో కోర్టు ఆదేశాలతో జైలుకు తరలించారు. ప్రస్తుతం వారంతా రిమాండ్ ఖైదీలుగా జైలులో ఉన్నారు. ఈ కేసులో తదుపరి అధికారుల నిర్ణయం ఎలా ఉండబోతోందో చూడాలి.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి...

### ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్...



తిరుపతి **ఆకాంక్ష డిసెంబర్ 15 :** తిరుపతి తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ ఈ సందర్భంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీకి ఆశీస్సులు అందించాలని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఏనుగుని దర్శించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కొత్త సంవత్సరం అందరికీ మంచి జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## చలి తీవ్రతకు వణుకుతోన్న ఉత్తరభారతం....

### దారుణంగా పడిపోయిన విజిబిలిటీ....

### ఢిల్లీని కమ్మేసిన పొగమంచు.. 100కుపైగా విమానాలు రద్దు...





న్యూఢిల్లీ **ఆకాంక్ష డిసెంబర్ 15 :** చలి తీవ్రతకు ఉత్తరభారతం వణుకుతోంది దేశ రాజధాని ఢిల్లీ సహా యూపీ, పంజాబ్, జార?ండ్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. ఆయా ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసింది.ఎన్సీఆర్ ప్రాంతాన్ని దట్టంగా పొగ కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. ఈ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విమాన, రైలు రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ రాడార్24 ప్రకారం.. పొగ మంచు కారణంగా ఇవాళ ఉదయం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఏకంగా 100కుపైగా విమానాలు రద్దయ్యాయిసుమారు 300 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరోవైపు లో విజిబిలిటీ కారణంగా దాదాపు 100 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఢిల్లీకి రాకపోకలు సాగించే 90 రైళ్లు సుమారు ఆరు నుంచి ఏడు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి.పొగ మంచు పరిస్థితి నేపథ్యంలో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రయాణికులు తమ విమాన స్టేటస్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించింది. ఇండిగో, ఎయిరిండియా వంటి పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీలు జారీ చేశాయి. విమానాశ్రయంలో దృశ్యగోచరత తగ్గడం వల్ల పలు విమానాలు రద్దు కాగా.. మరికొన్ని ఆలస్యమయ్యాయని తెలిపాయి. విమానాల స్టేటస్ గురించి తెలుసుకోవడం కోసం తమ వెబ్‌సైట్లను పరిశీలిస్తూ ఉండాలని ప్రయాణికులకు సూచించాయి.

## లోక కళ్యాణార్థం గోదావరి పరిక్రమ యాత్ర....



మంథని. **ఆకాంక్ష డిసెంబర్ 15 :** శ్రీ రాజేంద్ర దాస్ మహారాజ్ బృందావన్ మాలూక్ పీఠాధిపతి ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం గోదావరి పరిక్రమ యాత్రను 500 మంది పీఠాధిపతులతో నాసిక్ లో నుండి ప్రారంభించారు. మన ప్రాంతంలోని మంచిర్యాల బీజాపూర్ చత్తీస్గఢ్ మీదుగా భద్రాచలం చేరుకొని కొవ్వూరు మీదుగా ఆదివారం కాళేశ్వరం వద్ద బస చేశారు. సోమవారం త్రివేణి సంగమంలో స్నానాధి కార్యక్రమాలు ముగించుకుని కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని మంథని మీదుగా ధర్మపురి వెళ్లే యాత్రలో భాగంగా ఈరోజు మంథనిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వారిని ఆహ్వానించి ఘనంగా సత్కరించడం జరిగింది. ఇందులో భాగంగా అయోధ్య వారణాసి తదితర పీఠాధిపతులకు పండ్లు అందించి వారి ఆశీర్వచనం తీసుకోవడం జరిగింది. పెద్ద ఎత్తున హిందూ బంధువులతో పాటు విశ్వహిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంథని ప్రకండ ఉపాధ్యక్షులు రావుల సతీష్, బోట్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బత్తుల సత్యనారాయణల పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్రెపల్లి వెంకటేశ్వర్లు, కెక్కెర్ల అనిల్, ప్రచారక్ తూర్పాటి రాము, సత్సంగ ప్రముక రాజమౌళి గౌడ్, కొమురవెల్లి హరీష్, గుండా శ్రీనివాస్, బొడ్డు వెంకటేష్, నూక శ్రీనివాస్, మాచిడి శ్రీధర్, కజ్జం శ్యామ్, కొమురవెల్లి సత్యనారాయణ, బొడ్డు సంపత్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాతృశక్తి ప్రముఖ్ రావికంటి రేణుక, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## 18 గ్రామ పంచాయతీల్లో 17 చోట్ల

## ఉప సర్పంచ్ ఎన్నికలు పూర్తి...

నాగర్‌కర్నూల్.**ఆకాంక్ష డిసెంబర్ 15 :** నాగర్‌కర్నూల్ జిల్లా కందనూలు మండలం పరిధిలోని 18 గ్రామ పంచాయతీలకు గాను 17 గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని ఎంపీడీవో చెన్నమ్మ సోమవారం తెలిపారు. పెద్ద ముద్దునూరు గ్రామ పంచాయతీలో వార్డు సభ్యుల కోరం లేకపోవడంతో ఉప సర్పంచ్ ఎన్నికను వాయిదా వేసినట్లు ఆమె పేర్కొన్నారు.వివరాల ప్రకారం మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవుల కోసం నిర్వహించిన ఎన్నికల్లో ఆరేసిపల్లి గ్రామానికి గుండాల రాజు, బొందలపల్లి గ్రామానికి మందడి ధర్మారెడ్డి, చందుపట్ల గ్రామానికి నల్లగంటి సురేష్, గగ్గలపల్లి గ్రామానికి నస్రిన్, గన్యాకుల గ్రామానికి కురువెంటి పద్మ, గుడిపల్లి గ్రామానికి కుమ్మెర, కాట్రావత్ రవి, మల్కాపూర్ గ్రామానికి ఈనుపోతుల కురవమ్మ, మంతటి గ్రామానికి ఎగిరేపల్లి శివకుమార్, నల్లవెల్లి గ్రామానికి బుసిరెడ్డి రామచంద్రారెడ్డి, నర్సాయిపల్లి గ్రామానికి కే. రేణుక, పెద్దాపూర్ గ్రామానికి ఆలేటి బాబురెడ్డి, పులిజాల గ్రామానికి బి. మాధవరెడ్డి, శ్రీపురం గ్రామానికి జూపల్లి వెంకటయ్య, తూడుకుర్తి గ్రామానికి జి. వెంకటయ్య, వెంకటాపూర్ గ్రామానికి వంగూరు భాస్కర్ రెడ్డి, వనపట్ల గ్రామానికి దీక్షిత్ రెడ్డిలు ఉప సర్పంచ్లుగా ఎంపికైనట్లు ఆమె తెలిపారు.పెద్ద ముద్దునూరు గ్రామ పంచాయతీలో వార్డు సభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఉప సర్పంచ్ ఎన్నికను తదుపరి తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీవో వెల్లడించారు. మండలంలో మిగతా అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

## సబ్బితం గ్రామంలో నూనె సరోజన

## రమేష్ చివరి రోజు ప్రచారం జోరు...



పెద్దపల్లిబ్యూరో. **ఆకాంక్ష డిసెంబర్ 15 :** పెద్దపల్లి జిల్లా సబ్బితం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా నూనె సరోజన రమేష్ చివరి రోజు ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచే గ్రామమంతా విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. చివరి ప్రచారంలో భాగంగా కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు.తాను బీద కుటుంబం నుంచి వచ్చిన వాడినని, అయినా ప్రజల ఆశీర్వాదం, అండదండలు తనకు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజల దీవెనలతో గెలిచి సబ్బితం గ్రామ అభివృద్ధికి పూర్తిగా అంకితమవుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వంనుంచి వచ్చే నిధులన్నింటినీ గ్రామ అభివృద్ధికే వినియోగిస్తానని తెలిపారు. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.తమకు శాసనసభ్యుడు విజయరామణారావు ఆశీస్సులు, ఆదరణ ఉన్నాయని పేర్కొంటూ, ఆయన అశీర్వాదాలతో తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. చివరి రోజు ప్రచారంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు ప్రకటించారు.

## ఫుట్‌బాల్ స్టార్‌ని కలిసేందుకు వీఐపీలు క్యూ...

## మెస్సి..హ్యాండ్ షేక్‌కి రూ.కోటి..



న్యూడిల్లీ **ఆకాంక్ష డిసెంబర్ 15 :** అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి భారత పర్యటన కొనసాగుతోంది. 'గోట్ ఇండియా టూర్'లో ఇండియాకి వచ్చిన మెస్సి.. ఇక్కడ ప్రధాన నగరాల్లో సందడి చేస్తున్నారు. తొలిరోజు కోల్‌కతా, హైదరాబాద్ నగరాలను సందర్శించిన మెస్సి.. రెండో రోజు ముంబైలో సందడి చేశారు. ఇవాళ దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇవాళ ఉదయం 10:45 గంటలకు ఢిల్లీలో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, ప్రస్తుతం అక్కడ పొగమంచు కారణంగా విమానం ఆలస్యమైనట్లు తెలుస్తోంది.ఇక మెస్సి రాక సందర్భంగా నగరంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. మెస్సి, అతని టీం కోసం చాణక్యపురిలోని ది లీలా ప్యాలెస్ లో ప్రత్యేకంగా ఓ అంతస్తు మొత్తాన్ని రిజర్వ్ చేశారు. అర్జెంటీనా జట్టు హోటల్‌లోని ప్రెసిడెన్షియల్ సూట్స్‌లో బస చేయనుంది. ఇక్కడ ఒక్క రాత్రికి రూ.3.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ ఖర్చువుతుందని సమాచారం. ఇక మెస్సి బస గురించి ఎలాంటి వివరాలను పంచుకోవద్దని అక్కడి హోటల్ సిబ్బందికి నిర్వాహకులు కఠినమైన ఆదేశాలు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తాజాగా తెలిపాయి. ఇక ఈ స్టార్ ప్లేయర్ బస చేసే హోటల్ చుట్టూ భద్రతను పెంచారు.ఇక హోటల్‌లో నిర్వాహకులు 'మీట్ అండ్ గ్రీట్'ను ఏర్పాటు చేశారు. పలువురు కార్పొరేట్లు, వీఐపీలు మెస్సిని కలవనున్నారు. పలు నివేదికల ప్రకారం.. మెస్సిని కలిసేందుకు పలువురు భారీగా ఖర్చు పెట్టేందుకు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొందరు కార్పొరేట్లు ఫుట్‌బాల్ ఐకాన్‌ను కలిసి హ్యాండ్ షేక్ కోసం రూ.కోటి వరకూ ఖర్చు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.ఢిల్లీ పర్యటనలో మెస్సి.. భారత ప్రధాన న్యాయమూర్తి, పలువురు ఎంపీలు, క్రికెటర్లు, ఒలింపిక్, పారాలింపిక్ పతక విజేతలను కలవనున్నారు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియాన్ని సందర్శించనున్నారు మెస్సి. అక్కడే భారత క్రికెట్ బృందంతో సంభాషించనున్నట్లు తెలిసింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, పారాలింపిక్‌లో బంగారు పతక విజేత సుమిత్ అంటిల్, బాక్సింగ్ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, ఒలింపిక్ హైజంప్ పతక విజేత నిషాద్ కుమార్ సహా పలువురిని మీట్ అవ్వనున్నారు. ఇవాళ సాయంత్రం 6 గంటలకు మెస్సి ఇండియా టూర్ ముగియనుంది. రాత్రి 8 గంటలకు ఢిల్లీ పర్యటన ముగించుకొని మెస్సి వెళ్లిపోనున్నారు. తన పర్యటనలో ప్రధాని మోదీతో కూడా మెస్సి భేటీ అవుతారని ముందుగా వార్తలు వచ్చాయి. అయితే, ప్రధాని ఇవాళ ఉదయమే మూడు దేశాల పర్యటన నిమిత్తం బయల్దేరి వెళ్లారు.

## మాజీ ప్రధాన మంత్రులు నెహ్రూ, ఇందిర అమెరికాకు ఆ పర్మిషన్ ఇచ్చారు..

### బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే సంచలన ఆరోపణలు...



న్యూడిల్లీ **ఆకాంక్ష డిసెంబర్ 15 :** మాజీ ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ ఇందిరాగాంధీలపై బీజేపీ సీనియర్ నేత, ఎంపీ నిషికాంత్ దూబే సంచలన ఆరోపణలు చేశారు. ఆ ఇద్దరు ప్రధానులు భారత్‌లోని ఒక పర్వతంపై నిఘా పరికరం అమర్చేందుకు అమెరికా కు అనుమతిచ్చారని ఆరోపించారు. ఈ మేరకు ఇవాళ (సోమవారం) ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్టుపెట్టారు.చైనా కార్యకలాపాలపై నిఘా కోసం మన దేశంలో అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ నేతృత్వంలో కోవర్ట్ ఆపరేషన్ దశలవారీగా జరిగిందని, నెహ్రూ హయాంలో తొలిసారి అణు ఆధారిత నిఘా పరికరాన్ని నందాదేవీ పర్వత శిఖరాన (ఉత్తరాఖండ్‌లోని) అమర్చేందుకు అనుమతించారని దూబే తన పోస్టులో పేర్కొన్నారు. తర్వాత ఇందిరాగాంధీ హయాంలోనూ అందుకు అనుమతి లభించిందని ఆరోపించారు.ఆ తర్వాత అగ్రరాజ్యం నందాదేవి నుంచి తన కార్యకలాపాలను ఉపసంహరించుకుందని దూబే తెలిపారు. పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయన్ ప్రాంతంలో ఆ ప్రమాదకర పరికరాన్ని వదిలేసి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకు గంగానది ఒడ్డున నివసిస్తున్న ప్రజల్లో క్యాన్సర్ కేసులు పెరగడానికి ఇది కారణం కాదా..? అని ప్రశ్నించారు. హిమానీనదాలు కరగడానికి, క్లౌడ్‌బరస్ట్, ఇళ్లల్లో పగుళ్లకు కూడా ఇదే కారణమా..? అని అనుమానం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో 1978లో నిఘా పరికరం విషయాన్ని అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ అంగీకరించారని దూబే పేర్కొన్నారు. అమెరికా వార్తా సంస్థ న్యూయార్క్ టైమ్స్ ఇటీవల దీనిపై కథనాన్ని ప్రచురించిందని తెలిపారు. ఇప్పుడు మన భావితరాలను కాపాడుకునే సమయం ఆసన్నమైందని తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. ఈ అంశంపై 1978లో అమెరికా చట్టసభ సభ్యులు తమ ప్రభుత్వానికి రాసిన లేఖను ఆయన షేర్ చేశారు.కొన్ని నెలల క్రితం కూడా దూబే ఈ విషయంపై కాంగ్రెస్‌ను విమర్శించారు. నందాదేవీ పర్వతంపై కనిపించకుండా పోయిన అమెరికా అణు పరికరానికి, ఉత్తర భారతంలో ఇటీవల ప్రకృతి వైపరీత్యాలకు ముడిపెడుతూ ఆయన విమర్శలు చేశారు. నెహ్రూ, ఇందిరతోపాటు రాహుల్ గాంధీ విదేశీ శక్తులకు లొంగిపోయి, దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని మండిపడ్డారు. వారి చర్యలు భావితరాలకు ప్రమాదకరంగా మారాయని ఆరోపించారు.

## నిజాయితీ అభివృద్ధి నినాదంతో

## అనిల్ సాత్తురి బరిలో...



ఓదెల.**ఆకాంక్ష డిసెంబర్ 15 :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కోలనూర్ గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థి అనిల్ సాత్తురి సోమవారం గ్రామ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నిరుపేద కుటుంబానికి చెందిన చదువుకున్న యువకుడిగా తాను ఎప్పటికప్పుడు ప్రజల మధ్యనే ఉంటూ గ్రామ సమస్యలపై నిజాయితీగా పోరాడుతున్నానని పేర్కొన్నారు. గ్రామ అభివృద్దే తన జీవిత లక్ష్యమని, ఆ దిశగా నిరంతర కృషి చేస్తానని తెలిపారు.ఈ ఎన్నికల్లో తమ ఓటమి ఖాయమని గ్రహించిన కొందరు ప్రత్యర్థులు డబ్బు, మద్యం వంటి ప్రలోభాలతో గ్రామ ప్రజలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి ప్రలోభాలకు లొంగకుండా సత్యాన్ని గుర్తించి, గ్రామ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.తాను గెలిచిన అనంతరం గ్రామ అభివృద్ధి కోసం సిద్ధం చేసిన మ్యానిఫెస్టోను అక్షరాలా అమలు చేస్తానని అనిల్ సాత్తురి హామీ ఇచ్చారు. రెండున్నర సంవత్సరాల తర్వాత ప్రజల ముందుకు వచ్చి తన పనితీరుపై ప్రశ్నించుకునేందుకు సిద్ధమని, ప్రజలకు తాను చేసిన పని నచ్చకపోతే సర్పంచ్ పదవికి రాజీనామా చేయడానికైనా వెనుకాడనని స్పష్టం చేశారు.ఈ ఎన్నికల్లో ఉంగరం గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోలనూర్ గ్రామ ప్రజలను అనిల్ సాత్తురి కోరారు

## నూతనంగా ఎన్నికైన సర్పంచును సత్కరించిన మంథని సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్...



మంథనిరూరల్. **ఆకాంక్ష డిసెంబర్ 15 :** మంథని మండలం నగరంపల్లి గ్రామానికి ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శాలువాతో సోమవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో సర్పంచ్ నాతరి లత-శ్రీనివాస్,ఉపసర్పంచ్ పొరెడ్డి ప్రసన్న-తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు నౌండ్ల సదానందం, మల్యాల కిరణ్ కుమార్, తోకల శ్రీనివాస్, ఏట శ్రీనివాస్ లను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఘనంగా సత్కరించి శుభాకాక్షలు తెలిపారు. తమ విజయానికి కృషి చేసిన ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, గ్రామస్తులకు, నాయకులు, కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం ప్రభాకర్, బూడిద రాజయ్య, తదితరులు పాల్గొన్నారు

## కొత్తపల్లి సర్పంచ్ పద్మ జగన్‌కు పద్మాదేవేందర్‌రెడ్డి అభినందనలు...



మెదక్.**ఆకాంక్ష డిసెంబర్ 15 :** మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ తరఫున కొత్తపల్లి గ్రామ సర్పంచ్‌గా గెలుపొందిన కుమ్మరి పద్మ జగన్ సోమవారం హైదరాబాద్ కొంపల్లిలోని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మ జగన్‌తో పాటు గ్రామ వార్డు సభ్యులు కూడా ఆమెను కలిశారు.సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి పద్మ జగన్‌ను, వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పాలన సాగించాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఆశయాలను గ్రామస్థాయిలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు.ఈ భేటీ సందర్భంగా గ్రామ అభివృద్ధి, స్థానిక సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగినట్లు సమాచారం. కొత్తపల్లి గ్రామంలో బీఆర్ఎస్ విజయం సాధించడంపై నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడంపై సుప్రీంకోర్టు అసహనం...



న్యూడిల్లీ **ఆకాంక్ష డిసెంబర్ 15 :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బృందావన్‌లోని ఓ ఆలయ దర్శన వేళల్లో మార్పులకు సంబంధించిన కేసుల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బృందావన్‌లోని బాంకీ బిహారీ ఆలయంలో దర్శన వేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడంపై అసహనం వ్యక్తంచేసింది.దేవుని విశ్రాంతి వేళల్లో ప్రత్యేక పూజలు చేయడం సమంజసం కాదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో దర్యాప్తునకు ఉన్నతస్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది. బాంకీ బిహారీ ఆలయంలో దర్శన వేళల్లోనే కాకుండా.. పలు మతపరమైన పూజా విధానాల్లోను మార్పులు చేస్తున్నట్లు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, న్యాయవాది తన్వి దూబే కోర్టుకు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని, కానీ ఆ సమయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని అన్నారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసింది. దేవతలకు విశ్రాంతినివ్వకుండా ప్రత్యేక పూజలు చేయాల్సిన అవసరమేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆచారం ప్రకారం వస్తున్న పవిత్రమైన ఆలయ నియమాలను, సమయాలను పాటించాలని అధికారులను ఆదేశించింది.

# మహిళల్లో మానసిక వేదనలు.. ఓపెన్‌గా ఎందుకు మాట్లాడలేరంటే..



ఒకే సమస్య.. కానీ ఒకరు ఓపెన్‌గా మాట్లాడతారు. మరొకరు మాట్లాడలేకపోతారు. కారణం సామాజిక అంచనాలు, అవగాహనా రాహిత్యం, పరిస్థితుల ప్రభావం ఇందులో కీ రోల్ పోషిస్తాయి. కొన్ని అంశాల్లో స్త్రీ, పురుషుల విషయానికి వస్తే ఈ ఆధునిక కాలంలోనూ అదే జరుగుతోందని నిపుణులు అంటున్నారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు స్త్రీ, పురుషుల సమానత్వ భావనకు సంబంధించి సానుకూల మార్పులు చాలానే వచ్చాయి. మహిళలు అనేక రంగాల్లో దూసుకుపోతున్నారు. ఇష్టమైన కెరీర్‌లో ప్రవేశించడానికి, నచ్చిన విధంగా జీవించడానికి రాజ్యాంగపరమైన హక్కులను కూడా కలిగి ఉన్నారు. అయినప్పటికీ పురుషాధిక్య భావజాలమే ఏదో ఒక రూపంలో నేటికీ డామినేట్ చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు స్త్రీ వాదులు. ఇలాంటి పరిస్థితులే నేటికీ కొన్ని విషయాల్లో మహిళలు ఓపెన్‌గా మాట్లాడే పరిస్థితికి కారణం అవుతున్నాయి. ముఖ్యంగా మెంటల్ హెల్త్ విషయంలో మహిళలు పూర్తి నిర్లక్ష్యానికి గురవుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. బయటకు చెప్పలేని పరిస్థితులు మహిళల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాల్లో మానసిక ఆరోగ్యం ఒకటి. ఇప్పటికీ విదేశాలతో పోలిస్తే ఇండియాలో స్త్రీల మనోభావాలు, మనసులో మాటలు, మానసిక ఆరోగ్యం వంటి విషయాలు అంత ప్రయారిటీ గల అంశంగా పరగణించని వారే చాలా మంది ఉంటున్నారు. పురుషులు తమ ఫిజికల్ అండ్ మెంటల్ హెల్త్ గురించి మాట్లాడినంత, ఓపెన్‌గా స్త్రీలు మాట్లాడుకునే పరిస్థితి కుటుంబాల్లో ఇప్పటికీ లేదు. ఎందుకంటే మహిళలు ఏది చెప్పినా తప్పుగా అర్థం చేసుకునే పురుషాధిక్య భావజాలమే అధికం కాబట్టి. ముఖ్యంగా ప్రేమ, కోరికలు, రుతుస్రావం, ఇష్టాయిష్టాలు, సెక్స్ వంటి విషయాలైతే ఇప్పటికీ వాటిని స్త్రీలు లేదా అమ్మాయిలు బయటకు మాట్లాడకూడనివిగా భావిస్తుంటారు చాలా మంది. దీంతో ఇలాంటి విషయాల్లో సమస్యలు వచ్చినా, సందేహాలు ఏర్పడినా బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు ఇప్పటికీ ఉంటున్నారు. తమ సమస్యను చెబితే ఇతరులు ఏమనుకుంటారోననే ఫీలింగ్ ఆధునిక మహిళలను పైతం వెంటాడుతోంది. ఒత్తిడి, ఆందోళనలతో సతమతం ఒత్తిడి, డిప్రెషన్, యాంగ్జైటీ, ఈటింగ్ డిజార్డర్ వంటివి ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ, పురుషులందరూ ఎదుర్కొనే కామన్ సమస్యలే. అయితే పురుషులు వీటిని ఎదుర్కొంటున్నప్పుడు అవి కుటుంబాల్లో చర్మనీయాంశం అవుతాయి. వెంటనే ట్రీట్మెంట్, ఎమోషనల్ సపోర్ట్ వంటివి లభిస్తాయి. కానీ పురుషులు బయటకు చెప్పుకోగలిగినంత ఈజీగా మహిళలు ఈ సమస్యలను చెప్పుకోవడం లేదు. అలాగే ఇప్పటికీ చాలా వరకు అమ్మాయిలు, అబ్బాయిల ద్వారా వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ ఆ విషయాన్ని తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, వర్క్ ప్లేస్‌లో కొలీగ్స్‌తో పంచుకోలేరు. అత్యంత సన్నిహితులతో కూడా వెంటనే చెప్పే ధైర్యం చేయని వారే చాలామంది ఉంటారు. ఏదైనా పెద్ద సమస్యగా మారుతుందనుకొని భయపడినప్పుడు మాత్రమే చెప్పగలుగుతున్నారు. కారణం.. పురుషాధిక్య భావజాలం. బయటకు చెప్తే చుట్టు పక్కల జనాలు, సమాజం తమను హేళన చేస్తుందని, అవమానాలు, అనుమానాలు వంటివి ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఆధునిక మహిళలను కూడా ఎటూ తోచనివ్వట్లేదు. హార్మోన్లలో మార్పులు మహిళలు ఎదుర్కొనే సాధారణ రుగ్మతలకు హార్మోన్లలో మార్పులు కూడా కారణం అవుతున్నాయి. పెరినాటల్ డిప్రెషన్, పెరి-మెనోపాసల డిప్రెషన్, ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ (పీఎంఎస్) వంటివి కూడా అందులో భాగమే. ఇవి స్త్రీలలో శారీరక, మానసిక సమస్యలకు, మార్పులకు కారణం అవుతుంటాయి. యంగ్ ఏజ్ మూడ్ స్వింగ్స్, పీరియడ్స్, ఏజ్ రిలేటెడ్ ఫీలింగ్స్, మ్యారేజ్, ప్రెగ్నెన్సీ, ప్రసవం వంటి అంశాల్లో హార్మోన్లు కీ రోల్ పోషిస్తాయి. అలాగే రుతుక్రమం ఆగిపోయే ముందు, ఆగిపోయిన తర్వాత కూడా మహిళల్లో మెంటల్ డిజార్డర్లు పెరుగుతుంటాయి. ఇవన్నీ మానసిక అల్లకల్లోలానికి దారితీస్తుంటాయి. అనుభవించే మహిళలకు, ఆస్పత్రులకు వెళ్లినప్పుడు వైద్య నిపుణులకు అర్థం అవుతుంటాయే తప్ప.. కుటుంబంలోని పురుషులు, ఇతర వ్యక్తులు ఈపరిస్థితులను అర్థం చేసుకోవడం చాలా అరుదు. అందుకే స్త్రీలు వీటిని బయటకు మాట్లాడలేకపోతుంటారు. సంబంధాలు - సవాళ్లు సమాజంలో, సంబంధాల్లో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లు కొన్నిసార్లు మానసిక సంఘర్షణలకు దారితీసే అవకాశం ఉంటుంది. ఇవి పురుషులతో పోలిస్తే మహిళల్లోనే అధికంగా ఉంటున్నాయి. పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, పిల్లల్ని కనడం, పెంచడం, ఫ్యామిలీని చూసుకోవడం వంటివి మహిళల్లో మానసిక, శారీరక సమస్యలకు దారితీస్తున్నాయి. పైగా ఇటువంటి ఇబ్బందికర పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల మద్దతు లభించకపోవడం, చివరికి సాటి మహిళలు, ఫ్రెండ్స్ ద్వారా కూడా ఎమోషనల్ సపోర్ట్‌లేక పోవడం వంటి కారణాలతో లోన్లీనెస్‌ను ఎదుర్కొంటున్న మహిళలు చాలామందే ఉంటున్నారు. అయినా బయటకు చెప్పుకోలేకపోతుంటారు. వేధింపులు, ఆర్థిక పరిస్థితులు మహిళలను మానసికంగా కృంగదీసే ప్రధాన వాటిలో ఇంటా బయటా సమస్యలు, లైంగి వేధింపులు కూడా ఉంటున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సూటిపోటి మాటలను చాలామంది ఎదుర్కొంటున్నప్పటికీ బయటకు చెప్పుకోలేకపోతారు. చెప్పుకున్నా తగిన సపోర్ట్ లభించకపోగా మహిళలనే బాధితులుగా చేసే పరిస్థితుల కారణంగా ఇలా జరుగుతుందని నిపుణులు అంటున్నారు. ఇవేకాకుండా కొన్నిసార్లు మానసిక ఆందోళనలు స్త్రీలలో పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ వంటి రుగ్మతలకు దారితీస్తున్నాయి. డిప్రెషన్‌లో కూరుకుపోయి ఏదైనా తప్పుగా మాట్లాడినా, తప్పుగా ప్రవర్తించిన కూడా అమ్మాయిలను అర్థం చేసుకునే పరిస్థితి చాలా అరుదు. పైగా వారిపై చెడ్డవారు అనే ముద్ర వేయడం పరిపాటిగా మారిపోయింది. పరిష్కారం ఏమిటి? మహిళలు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని ఎదుర్కోవడానికి అవసరమైన సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందడం లేదని నిపుణులు, స్త్రీ వాదులు అంటున్నారు. మహిళల మానసిక ఇబ్బందులను అసలు ఆరోగ్య సమస్యగా పరిగణించకపోవడం, సమాజంలో నాటుకుపోయిన మూఢ నమ్మకాలు, పురుషాధిక్య భావజాలం వంటివి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్త్రీలలో మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. కాబట్టి వీటిని అర్థం చేసుకోవడంలో, ఎదుర్కోవడంలో స్త్రీలకు సహకారం సమాజం నుంచి, కుటుంబ సభ్యుల నుంచి సాటి మహిళల నుంచి సమపోర్ట్ అందాల్సిన అవసరం ఉందంటున్నారు నిపుణులు. సపోర్టివ్ సిస్టం బిల్డ్ చేయడం, ట్రీట్మెంట్ పొందడంలో సహకరించడం, సమస్య నుంచి బయటపడే వరకు మద్దతుగా నిలువడం వంటివి పరిష్కార అంశాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.

# సచిన్... సచిన్... మెస్సీ... మెస్సీ

## ముంబైని మురిపించిన దిగ్గజాల భేటీ

## వాంఖెడేలో అర్జెంటీనా స్టార్ సందడి



అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ తన 'గోట్ టూర్'లో భాగంగా రెండో రోజు ముంబైని మురిపించాడు. భారత మాస్టర్ సచిన్ టెండూల్కర్‌తో కలిసి వాంఖెడేలో సందడి చేశాడు. మామూలుగా అయితే ఈ మైదానంలో టెండూల్కర్ ఉంటే 'సచిన్... సచిన్...' అనే గోలే వినిపించేది. కానీ ఆదివారం స్వరం మారింది. యువ తరం, నవతరం అంతా కలిసి తమ ఆరాధ్య క్రికెటర్‌తో పాటు అభిమాన ఫుట్‌బాలర్ పేరునూ మార్మోగించారు. దీంతో వాంఖెడే స్టేడియం 'సచిన్... సచిన్... మెస్సీ... మెస్సీ...' నామస్మరణతో మార్మోగిపోయింది. సచిన్, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, భారత ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రితో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, బాలీవుడ్ స్టార్స్ అజయ్ దేవ్‌గణ్, టైగర్ ష్రాఫ్, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్, పలువురు సెలబ్రిటీలతో స్టేడియమంతా తారతోరణం దిద్దుకుంది. వాంఖెడే పుటల్లో ఈ పూట క్రీడా ప్రపంచంలోనే అలుపెరగని దిగ్గజాలు ప్రత్యక్షంగా మైదానాన్ని, పరోక్షంగా యావత్ భారత్‌ను అలరించారు. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లోని క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ తన పురిటి గడ్డపై జగద్విఖ్యాత ఫుట్‌బాలర్ లయోనల్ మెస్సీతో కలిసి సందడి చేశాడు. వాంఖెడే స్టేడియంలో దిగ్గజాల భేటీతో సరికొత్త అధ్యాయం ప్రారంభించినట్లయ్యింది. పోటెత్తిన అభిమానులతో కిక్కిరిసిపోయిన స్టేడియంలో వీరిద్దరే కేంద్ర బిందువులయ్యారు. భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రి, రాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సహా పుర ప్రముఖులు ఎందరున్నా... వేల కళ్లు సచిన్ మెస్సీల నుంచి చూపును తిప్పుకోలేకపోయాయి. ముఖ్యంగా భారత క్రికెట్ అభిమానులు తమ ఆరాధ్య దిగ్గజం సచిన్‌ను విఖ్యాత ఫుట్‌బాలర్‌తో కన్నుల పండుగగా చూసుకున్నారు. ఈ సందర్భంగా మహా సీఎం ఫడ్నవీస్ రాష్ట్రంలో యువ ఫుట్‌బాలర్ల ప్రతిభను సానబెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ప్రాజెక్ట్ మహాదేవ' పేరిట ఫుట్‌బాల్ ప్రతిభావంతుల్ని తయారు చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. అపురూపం... పరస్పర బహుమానం అర్జెంటీనా స్టార్‌కు టెండూల్కర్ తను స్వయంగా ఆటోగ్రాఫ్ చేసిన వన్డే జెర్సీని మెస్సీకి అందివ్వగా... ప్రతిగా మెస్సీ కూడా తన సంతకంతో కూడిన ఫుట్‌బాల్‌ను సచిన్‌కు ఇచ్చాడు. అన్నట్లు ఆటలు వేరైనా... దేశాలు వేరైనా... సచిన్ జెర్సీ నంబర్, మెస్సీ జెర్సీ నంబర్ ఒక్కటే 10! అదేనండీ 'దస్‌కా దమ్'! దిగ్గజాలు పరస్పర బహుమతులు ఇస్తూ స్వీకరిస్తుంటే అభిమానులంతా ఉప్పొంగిపోయారు. ఈ అపు'రూపం'ను తమ ఫోన్ కెమెరాల్లో పదిలంగా బందీచేసుకున్నారంతా! నేడు ప్రధాని మోదీతో మెస్సీ భేటీ... 'గోట్ టూర్'లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈరోజు మర్యాదపూర్వకంగా కలువనున్నాడు. మూడు రోజుల 'గోట్ టూర్' నేడు ఢిల్లీలో ముగియనుంది. ముంబై నుంచి సోమవారం ఉదయం 10 గంటల తర్వాత మెస్సీ ఢిల్లీ చేరుకుంటాడు. నగరంలోని క్రీడాభిమానులతో 'మీట్ అండ్ గ్రీట్' ముగించుకొన్న తర్వాత మెస్సీ... ప్రధాని మోదీతో భేటీ అవుతాడు. ప్రధాని నివాసంలో దాదాపు 20 నిమిషాల పాటు వీరిద్దరి మధ్య జరిగే మాటామంతీలో సాకర్ సూపర్ స్టార్ ఫుట్‌బాల్ ముచ్చట్లు పంచుకోకున్నాడు. ఆ తర్వాత భారత సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చీఫ్ రాహుల్ నవీన్, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, ఎంపీ ప్రఫుల్ పటేల్‌తో కూడా మెస్సీ భేటీ అవుతారని నిర్వాహకులు వెల్లడించారు. ఇలా పలువురు వీవీఐపీలను కలిసిన తర్వాత మెస్సీ మధ్యాహ్నం 3.30 గంటలకు అరుణ్ జైట్లీ స్టేడియానికి చేరుకుంటాడు. అక్కడ తన అభిమానుల్ని అలరించిన అనంతరం స్వదేశానికి పయనమవుతాడని నిర్వాహకులు వెల్లడించారు. నాకు ఇక్కడ (వాంఖెడే) మరుపేలేని మధుర జ్ఞాపకాలెన్నో ఉన్నాయి. అందుకే మన ముంబై ఒక కలల నగరి. ఈ వేదికపై ఎంతో మంది స్వప్నాలు సాకారమయ్యాయి. 2011 నాకు బాగా గుర్తు. నా కల (వన్డే వరల్డ్‌కప్) కూడా ఇక్కడే నిజమైంది. ముఖ్యంగా మీ (అభిమానులు) మద్దతే లేకపోతే ఆ స్వర్ణానుభూతిని నేనైతే ఎప్పటికీ చూడలేను. ఇప్పుడు కూడా మెస్సీని ఇక్కడ చూస్తుంటే అలాంటి అనుభూతే కలుగుతోంది. మన యువ ఫుట్‌బాలర్లను ప్రోత్సహించిన మెస్సీకి మీ అందరి తరఫున, భారతీయుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను.

# పిల్లల్లో ఆత్మవిశ్వాసరం పెరగాలంటే.. పేరేంట్స్ చేల్సింది ఇదే..!



చిన్న పిల్లల మనసు తెల్లకాగితం లాంటిది అంటారు నిపుణులు. ఆ కాగితంలో ఏ గీతలు గీస్తే ఆ గీతలే వారిని పెద్దయ్యాక ప్రభావితం చేస్తాయని చెబుతుంటారు. అందుకే మీ చిన్నారులు తర్వాతి జీవితంలో ఆనందంగా, ఆత్మ విశ్వాసంతో ఉండాలంటే వారిని అలా మార్చడం మీ చేతుల్లోనే ఉందనే విషయం పేరెంట్స్ గుర్తించాలి అందుకోసం వారిని చిన్నప్పటి నుంచే అలాంటి ప్రాక్టీస్ చేయించాలి. మోటివేషన్ : పిల్లలు శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్‌గా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమనే నమ్మకం వారిలో ఏర్పడుతుంది. కానీ ఇటీవల చాలా మంది పిల్లలు ఒత్తిడితో కూడిన చదువులు, వయసుకు మించిన ఆలోచనలు వంటి కారణాలతో మానసిక ఇబ్బందుల్ని ఫేస్ చేస్తున్నారు. అయితే వాటిని అధిగమించడానికి, పిల్లలు మెంటల్లీ బలంగా మారడానికి తల్లిదండ్రులు తగిన మోటివేషన్ అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి వాటిలో కమ్యూనికేషన్, సమాజంపై అవగాహన వంటివి చాలా ముఖ్యం అంటున్నారు నిపుణులు.కమ్యూనికేషన్: పిల్లలతో తల్లితండ్రులు తరచూ మాట్లాడుతూ ఉండాలి. వారి సమస్యల్ని అడిగి తెలుసుకుంటూ ఉండాలి. దీంతో వారిలో భయం, ఒత్తిడి వంటివి తగ్గిపోతాయి. అన్ని పరిస్థితుల్లోనూ తమ పేరెంట్స్ ఉన్నారని నమ్మడంతో ధైర్యం ఏర్పడుతుంది. అది పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఆ తర్వాత పేరెంట్స్ అవసరం లేకుండానే సమస్యలను ఎదుర్కొనే స్థాయికి ఎదుగుతారు. ఊబకాయంతో క్యాన్సర్ రిస్క్..2035 నాటికి మరింత పెరిగే చాన్స్! సమాజంపై అవగాహన: మీ పిల్లలకు సామాజిక నైపుణ్యాలు నేర్పించాలి. ఇతరులతో ఎలా మసలుకోవాలి? ఎలా మాట్లాడాలి? ఎలాంటి వారితో స్నేహం చేయాలి? ఏది మంచి, ఏది మంచిది కాదు.. ఏది అవసరమో, ఏది అనవసరమో పిల్లలకు చెప్పాలి. అలాగే వారిపై సానుభూతి చూపిస్తూనే అవసరమైన సందర్భంలో హెచ్చరించాలి. ఎప్పుడైనా సరే పిల్లలపై అరవడం, కొట్టడం వంటివి చేయకూడదు. తప్పు చేస్తే ఆ తప్పును వివరించి వారికి అర్థమయ్యేలా చెప్పాలి.ఫిజికల్ యాక్టివిటీస్ : పిల్లలు మానసికంగా దృఢంగా తయారు కావాలంటే.. ఫిజికల్ యాక్టివిటీస్ తప్పక ఉండాలి. చిన్న చిన్న పనులు చేయడం, చెడు అనే విషయాలు చెప్పాలి. ఎదుటివారి మనోభావాలకు రెస్పెక్ట్ ఇవ్వడం, మంచిని స్వీకరించడం, చెడును వ్యతిరేకించడం వంటివి నేర్పించాలి. సరైన నిద్ర, డైట్: పెద్దల కైనా, పిల్లలకైనా సరైన సమయానికి మంచి నిద్ర అవసరం. నిద్ర సరిగ్గా పోకపోతే ఒత్తిడి పెరిగిపోయి.. మానసికంగా బాధపడుతుంటారు. కాబట్టి నాణ్యమైన ఆహారం, మంచి నిద్ర ఉండే వాతావరణాన్ని కల్పించాలి. ఇది పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.ప్రేమ, అనుబంధం: పిల్లల పట్ల ప్రేమ చూపించాలి. వారు అడిగిన వస్తువుల్ని.. అవసరమైనవి అప్పుడప్పుడూ కొనివ్వడం కూడా చేయాలి. అలాగనీ అడిగిందల్లా కొనివ్వడం కూడా గ్రౌండ్‌లో ఆటలు ఆడటం, అట్లనే యోగా, మెడిటేషన్ వంటివి కూడా పిల్లల్లోని ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యల్ని దూరం చేస్తాయి. దీనికి తోడు సరైన పోషకాహారం చాలా ముఖ్యం.స్ఫూర్తిదాయకమైన కథలు: తల్లిదండ్రులు పిల్లల్లో ఆత్మ విశ్వాసం, ధైర్యం, స్ఫూర్తిని నింపే మాటలు మాట్లాడుతూ ఉండాలి. పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. మీరు మంచి కోసం ఏదైనా చేయగలరనే నమ్మకాన్ని వారిలో కలిగించాలి. వారిలో స్ఫూర్తిని కలిగించే కథలు చెప్పాలి. ఇవి పిల్లల్లో ఆలోచనా శక్తిని, అవగాహనను పెంపొందిస్తాయి.అభిప్రాయాలకు గౌరవం ఇవ్వడం: పిల్లల్ని ఎంతసేపూ.

## గిల్ టీ20 ప్రపంచకప్‌లో మ్యాచ్‌లు

# గెలిపిస్తాడు: అభిషేక్ శర్మ



గాయం తర్వాత గిల్, కెప్టెన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత సూర్యకుమార్ యాదవ్ ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. దీంతో వారిపై సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్స్ కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి జరిగిన మూడో టీ20లో సైతం గిల్, సూర్యాలు మంచి ఫామ్ కనబరచలేదు. ప్రస్తుతం ఫామ్‌లో లేక విమర్శలు ఎదుర్కొంటున్న భారత వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ త్వరలోనే తిరిగి ట్రాక్‌లోకి వస్తాడని, వచ్చే ఏడాది జరగబోయే టీ20 ప్రపంచకప్ లో భారత్‌కు మ్యాచ్‌లు గెలిపిస్తాడని గిల్ బాల్య స్నేహితుడు, సహచర క్రికెటర్ అభిషేక్ శర్మ ధీమా వ్యక్తం చేశారు. 12 ఏళ్ల వయస్సు నుంచీ గిల్‌తో కలిసి ఆడుతున్నందున, అతడి సామర్థ్యంపై తనకు పూర్తి అవగాహన ఉందని అభిషేక్ పేర్కొన్నారు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో గిల్ ప్రదర్శనపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి, ముఖ్యంగా స్థిరంగా ఆడుతున్న సంజు శాంసన్‌ను పక్కన పెట్టిన తర్వాత ఈ విమర్శలు ఎక్కువయ్యాయి. వైస్-కెప్టెన్ హోదాలో గిల్ 15 ఇన్నింగ్స్‌లలో 137.3 స్ట్రైక్-రేట్‌తో కేవలం 291 పరుగులు మాత్రమే చేశాడు. ఈ మ్యాచ్‌లలో అతను కేవలం నాలుగు సిక్సర్లు మాత్రమే కొట్టాడు. ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20లో, 118 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, గిల్ ఒక బంతికి ఒక పరుగు చొప్పున కష్టపడి 28 పరుగులు చేశాడు. అయితే, ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (18 బంతుల్లో 35 పరుగులు) మెరుపు ఆరంభాన్ని ఇవ్వడంతో ఆ లక్ష్యం సులభంగా ఛేదించబడింది. "ప్రతి ఒక్కరూ శుభ్‌మన్‌పై నమ్మకం ఉంచాలి, అతడు టీ20 ప్రపంచకప్‌లో ఖచ్చితంగా మాకు మ్యాచ్‌లు గెలిపిస్తాడు" అని అభిషేక్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## చలికాలంలో కలలు ఎక్కువగా

# వస్తున్నాయా.. కారణాలు ఇవే..?



చలికాలం మొదలైనప్పటి నుంచి చాలామందికి కలలు ఎక్కువగా వస్తుంటాయి.. స్పష్టంగా గుర్తుంటాయి కూడా అయితే ఇది ఏదైనా అనారోగ్య లక్షణమా? లేక సహజమైన మార్పేనా? అనే అనుమానాలకు వైద్య నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. చలికాలంలో నిద్ర లోతుగా పడటం వల్ల నిద్ర దశ ఎక్కువసేపు కొనసాగుతుంది. ఈ దశలోనే ఎక్కువగా కలలు వస్తాయి. వేసవితో పోలిస్తే చలిలో శరీర ఉష్ణోగ్రత తగ్గడం, మెలటోనిన్ అనే నిద్ర హార్మోన్ ఎక్కువగా విడుదల కావడం వల్ల మెదడు మరింత యాక్టివ్‌గా పనిచేస్తుందని తెలిపారు. అలాగే చలిలో బరువైన దుప్పట్లు వాడటం, నిద్ర మధ్యలో ఒక్కసారైనా మేల్కొనడం వల్ల వచ్చిన కలలు స్పష్టంగా గుర్తుండిపోతాయని వైద్యులు చెబుతున్నారు. మానసికంగా ఆలోచనలు, ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారిలో భయంకరమైన కలలు కూడా ఎక్కువగా రావచ్చని హెచ్చరిస్తున్నారు. వైద్య నిపుణుల మాటల్లో, చలికాలంలో కలలు ఎక్కువగా రావడం సాధారణమైన శారీరక ప్రక్రియ మాత్రమే తప్ప, దీనిని వ్యాధిగా భావించాల్సిన అవసరం లేదన్నారు. అయితే కలల వల్ల నిద్రకు అంతరాయం కలుగుతూ, రోజువారీ జీవనంపై ప్రభావం చూపితే మాత్రం వైద్యులను సంప్రదించడం మంచిదని సూచించారు. నిద్ర బాగా రావాలంటే నిద్రకు ముందు మొబైల్ వినియోగం తగ్గించడం, గోరువెచ్చని ఆహారం తీసుకోవడం, చలి గాలి నేరుగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

## లేజర్లు లేకుండానే దృష్టిలోపాన్ని సరిచేసే

# కొత్త టెక్నిక్: తో భవిష్యత్ విజన్ థెరపీ!



అధునాతన కంటి శస్త్ర చికిత్సల్లో భాగంగా లేజర్లను ఉపయోగిస్తారు. దీనివల్ల ట్రీట్మెంట్ సులభం అవుతుంది. అయితే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఇర్విన్ కు చెందినబ్రయన్ వాంగ్, ఆక్సిడెంటల్ కాలేజ్‌కు చెందిన మైకెల్ హిల్ అనే ఇద్దరు శాస్త్రవేత్తలు మరో కొత్త పద్ధతిని డెవలప్ చేశారు. లేజర్లు లేకుండా కూడా దృష్టిని సరిచేయడానికి, కంటి చూపును మెరుగు పర్చడానికి ఎలక్ట్రో మెకానికల్ రీషేపింగ్ అనే టెక్నిక్‌ను ప్రవేశపెట్టారు. అదేమిటి? ఎలా పనిచేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. పరిశోధకులు డెవలప్ చేసిన కొత్త మెథడ్‌లో కంటి మొదటి పొర అయిన కార్నియాను కట్ చేయకుండానే, సాఫ్ట్ విద్యుత్ ప్రవాహాలతో దాని ఆకారాన్ని మారుస్తారు. అందుకోసం ప్లాటినమ్‌తో తయారు చేసిన ప్రత్యేక 'కాంటాక్ట్ లెన్స్' ఎలక్ట్రోడ్‌ను కార్నియా పై ఉంచి, సుమారు ఒక నిమిషం వ్యవధి గల తక్కువ స్థాయిలో ఎలక్ట్రిక్ పొటెన్షియల్ వాడుతారు. ఇది కార్నియాలోని కొల్లాజెన్ ఫైబర్ల(మధ్య ఆకర్షణలను బలహీనపరచడానికి టిష్యూ ని తగ్గించి సాఫ్ట్‌గా మారుస్తుంది. ఈ సమయంలో కార్నియా లెన్స్ ఆకారానికి అనుగుణంగా మారుతుంది. పవర్ ఔటేజ్ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వచ్చి, కొత్త ఆకారాన్ని లాక్ చేస్తుంది. ఈ ప్రాసెస్ ప్రభావవంతమైనదే కాకుండా, సురక్షితమైనదని కూడా పరిశోధకులు అంటున్నారు.పరిశోధనలో భాగంగా కొత్త చికిత్స పద్ధతిని శాస్త్రవేత్తలు 12 కుందేళ్ల పై పరీక్షించారు. వీటిలో 10 కుందేళ్లలోతక్కువ కంటి చూపు, దూర దృష్టి లోపం సమస్య అయిన మాయోపియా సృష్టించి చికిత్స చేశారు. అన్ని సందర్భాల్లోనూ కార్నియాను సరైన ఆకారంలోకి మార్చడం ద్వారా కంటి చూపును మెరుగు పర్చగలిగారు. పైగా ఏమాత్రం నష్టం లేకుండా కంటి భాగంలోని కణాలు జీవించి ఉన్నాయి. అంటే ఎటువంటి కటింగ్ లేదా లేజర్ కాంతి ప్రయోగం లేకుండానే ట్రీట్మెంట్ సక్సెస్ అయింది. ఇందుకు సంబంధించిన పద్ధతిని, ఫలితాలను శాస్త్రవేత్తలు అమెరికన్ కెమికల్ సొసైటీ ఫాల్ 2025 సమావేశాల్లోనూ ప్రస్తావించారు. ఈ చికిత్సా పద్ధతి మాయోపియా, హైపరోపియా అస్టిగ్మటిజం వంటి దృష్టి సమస్యలకు భవిష్యత్ పరిష్కారంగా మారవచ్చునని నిపుణులు అంటున్నారు.

# మెస్సీ కోల్‌కతా పర్యటన.. మరో ఇద్దరి అరెస్ట్



'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి భారత్ లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే కోల్‌కతాలో పాల్గొన్న ఈవెంట్‌లో చోటు చేసుకున్న ఉద్రిక్త ఘటనకు సంబంధించి పోలీసులు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. స్టేడియంలో కుర్చీలు ధ్వంసం చేసి గందరగోళం సృష్టించినందుకు శుభ్రోప్రతిమ్, గౌరబ్ బసు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను మరో 15 రోజుల్లో ప్రభుత్వానికి అందజేస్తామని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఇప్పటికే అరెస్టైన ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాను స్థానిక కోర్టు 14 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న మెస్సి సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఫిరోజ్ షా కోట్లా మైదానంలో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

# డెకాయిట్ కోసం భలే ప్లాన్




టాలీవుడ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కలిసి నటిస్తున్న సినిమా డెకాయిట్. స్పై థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఆడియన్స్ లో మంచి అంచనాలున్నాయి. షానిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఉగాది, ఈద్ కానుకగా 2026 మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు ఇప్పటికే మేకర్స్ వెల్లడించారు. డిసెంబర్ 18న డెకాయిట్ ట్రైలర్ వాస్తవానికి ఈ సినిమా డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా రిలీజవాల్సింది కానీ కొన్ని కారణాల వల్ల సినిమాను వచ్చే ఏడాది మార్చి 19కి వాయిదా వేశారు. ఇదిలా ఉంటే తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన ఓ ముఖ్యమైన అప్డేట్ ను సోషల్ మీడియా ద్వారా అందించారు. డెకాయిట్ టీజర్ అప్డేట్ ను వెల్లడిస్తూ మేకర్స్ ఆడియన్స్ కు ఓ గుడ్‌న్యూస్ ను షేర్ చేశారు. వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ! ముంబైలో గ్రాండ్ ఈవెంట్ డెకాయిట్ టీజర్ ను డిసెంబర్ 18, 202న రిలీజ్ చేయనున్నట్టు మేకర్స్ వెల్లడించారు. అంతేకాదు, ఈ టీజర్ లాంచ్ ఈవెంట్ ను రెండు భాషల్లో, రెండు సిటీల్లో, రెండు టీజర్లను రిలీజ్ చేయనున్నట్టు కూడా తెలిపారు. అందులో భాగంగానే డిసెంబర్ 18వ తేదీ ఉదయం 11 గంటలకు ముంబైలోని గెయిటీ గెలాక్సీలో రిలీజ్ చేయనుండగా, డిసెంబర్ 18 సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్ లోని ఏఏఏ సినిమాస్ లో మీడియాతో మీట్ అండ్ గ్రీట్ తో పాటూ టీజర్ లాంచ్ ఈవెంట్ ను ఏర్పాటు చేశారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న సినిమా కావడంతో మేకర్స్ దాన్ని దృష్టిలో పెట్టుకునే టీజర్ లాంచ్ నుంచే ప్రమోషన్స్ ను ప్లాన్ చేశారని, అందులో భాగంగానే టీజర్ ను రెండు ప్రధాన నగరాల్లో చేస్తున్నారని వారి ప్లాన్ ను చూస్తుంటే అర్థమవుతుంది. కాగా ఈ సినిమాను సునీల్ నారంగ్, సుప్రియ యార్లగడ్డ సంయుక్తంగా నిర్మిస్తుండగా ఈ సినిమాలో బాలీవుడ్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో యాక్షన్, సస్పెన్స్ తో పాటూ స్ట్రాంగ్ ఎమోషన్స్ కూడా ఉంటాయని చిత్ర యూనిట్ చెప్తోంది.


స్టైలిష్ ఫోజులతో ఆకట్టుకుంటున్న నభా నటేష్!

సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత చాలామంది సెలబ్రిటీలు ముఖ్యంగా వర్కౌట్స్ చేస్తూ కూడా ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొంతమంది జిమ్లో వర్కౌట్స్ చేయడమే కాకుండా అక్కడ స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులిచ్చి అభిమానులను అలరిస్తున్నారు. అందులో భాగంగానే ప్రముఖ హీరోయిన్గా పేరు సొంతం చేసుకున్న నభా నటేష్ కూడా జిమ్ నుండీ కొన్ని ఫోటోలను పంచుకుంది. అందులో స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులిచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం నభా నటేష్ కి సంబంధించిన ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. వాళ్లకంటే మనవాళ్లే బెటర్! ఇదేం షాక్ భాయ్? 1995 డిసెంబర్ 11న కర్ణాటక రాష్ట్రం చిక్ మంగళూరు జిల్లా శృంగేరి లో జన్మించిన ఈమె మంగళూరులో ఇన్ఫర్మేషన్ సైన్స్ లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసింది. చదువుకుంటుండగానే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె ఫెమినా మిస్ ఇండియా బెంగళూరు 2013లో టాప్ టెన్ లో ఒకరిగా కనిపించింది. ఆ తర్వాత సినిమాల్లోకి అడుగు పెట్టిన ఈమె.. తొలిసారి 2015లో శివ రాజ్ కుమార్ తో కలిసి కన్నడ మూవీ వజ్రకాయలో నటించింది. ఈ చిత్రం ద్వారానే సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది నభా నటేష్. ఈ సినిమా సూపర్ హిట్ విజయాన్ని అందుకోవడంతో అమ్మడికి మంచి గుర్తింపు లభించింది. లైంగిక దాడి కేసులో నటికి ఊరట.. బాధితురాలికి అండగా నిందితుడి భార్య 2018లో తెలుగులో తొలిసారి నన్ను దోచుకుందువటే అనే సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయింది. అదుగో, ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్ వంటి చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరించింది. ఇకపోతే గత కొంతకాలం క్రితం యాక్సిడెంట్ బారిన పడ్డ ఈమె దాని నుండి రికవరీ అవ్వడానికి దాదాపు ఏడాదికి పైగానే సమయాన్ని తీసుకుంది. ఇప్పుడు వరుసగా హిస్టారికల్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ బిజీగా మారింది నభా నటేష్. ఫుల్ స్వింగ్ లో మల్టీస్టారర్ ట్రెండ్.. లైన్ లో పలు క్రేజీ సినిమాలు ప్రస్తుతం నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇటీవల ఈమె పుట్టినరోజు సందర్భంగా ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా మేకర్స్ రిలీజ్ చేశారు. సుందరవల్లి పాత్రలో నటిస్తున్నట్లు ఈమె పాత్రను రివీల్ చేశారు. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ సినిమా పలు కారణాలవల్ల వాయిదా పడుతూ వస్తోంది. హిస్టారికల్ బ్యాక్ గ్రౌండ్ లో వస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతోంది. ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పణలో భువన్ శ్రీకర్ నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. %ూశ్రీంశీ =ముం% - వారణాసి.. విక్రమార్కుడు తర్వాత ఇప్పుడేనా.. ఈ చిత్రంతోపాటు విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న నాగబంధం అనే చిత్రంలో కూడా హీరోయిన్గా నటిస్తోంది. ఒకవైపు గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా మరొకవైపు ఇలా హిస్టారికల్ పాత్రలలో కూడా నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. దీనికి తోడు ఒక వైపు సినిమాలలో బిజీగా ఉంటూనే మరొకవైపు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు డిఫరెంట్ ఫోటోషూట్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది నభా నటేష్.

# వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ!




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఫ్యాన్స్ కు ఒక సాలిడ్ సర్ప్రైజ్ దొరికింది. అనుదీప్ కెవి డైరెక్షన్ లో వస్తున్న 'ఫంకీ' సినిమా రిలీజ్ డేట్ ను మారుస్తూ మేకర్స్ ఒక క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ముందుగా ఈ సినిమాను 2026 ఏప్రిల్ లో రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ సినిమా షూటింగ్, అవుట్ పుట్ అనుకున్న దానికంటే బాగా రావడంతో ఫిబ్రవరి 13నే థియేటర్లలోకి తీసుకురావాలని ఫిక్స్ అయ్యారు. ప్రేమికుల రోజు సందర్భంగా వాలెంటైన్స్ వీకెండ్ లో ఈ సినిమా రావడం కచ్చితంగా ప్లస్ అవుతుంది. డెకాయిట్ కోసం భలే ప్లాన్ 'జాతి రత్నాలు' సినిమాతో అందరినీ పొట్టచెక్కలయ్యేలా నవ్వించిన డైరెక్టర్ అనుదీప్, ఇప్పుడు విశ్వక్ సేన్ తో సినిమా చేయడం ఓ వర్గం ఆడియెన్స్ లో ఆసక్తి పెరిగింది. సాధారణంగా విశ్వక్ సినిమాల్లో మాస్, యాక్షన్ ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్ తో వస్తున్నాడు. ఈ సినిమాలో విశ్వక్ సేన్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతోంది. ఇందులో ఆయన ఒక సినిమా డైరెక్టర్ గా కనిపించబోతున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్ చూస్తుంటే విశ్వక్ లుక్ చాలా స్టైలిష్ గా, కొత్తగా ఉంది. పసుపు రంగు షర్ట్ వేసుకుని, చేతిలో వాచ్ తో చాలా కూల్ గా కనిపిస్తున్నాడు. ఆ ఆటిట్యూడ్, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే క్యారెక్టర్ చాలా ఫన్నీగా డిజైన్ చేసినట్లు అర్థమవుతోంది. వాళ్లకంటే మనవాళ్లే బెటర్! ఇదేం షాక్ భాయ్? ఇక ఈ సినిమాతో టాలీవుడ్ కు కాయదు లోహర్ హీరోయిన్ గా పరిచయం అవుతోంది. స్క్రీన్ మీద విశ్వక్, కాయదు జోడీ చాలా ఫ్రెష్ గా కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య ఉండే కెమిస్ట్రీ సినిమాకు హైలైట్ అయ్యేలా ఉంది. యూత్ కు కనెక్ట్ అయ్యే లవ్ స్టోరీకి తోడు, అనుదీప్ రాసే పంచ్ డైలాగులు ఈ జంట మధ్య సన్నివేశాలను మరింత ఎంటర్టైనింగ్ గా మారుస్తాయని టాక్. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఆయన ఇచ్చే మాస్ బీట్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై నాగ వంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వీరి బ్యానర్ లో వచ్చే సినిమాలకు క్వాలిటీ విషయంలో మంచి పేరుంది. ఈ సినిమా కూడా అదే రేంజ్ లో రిచ్ గా ఉండబోతోందని తెలుస్తోంది. ఏప్రిల్ నుంచి ఫిబ్రవరికి సినిమాను ప్రీపోన్ చేయడం అంటే అవుట్ పుట్ మీద మేకర్స్ కు ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. సంక్రాంతి హడావుడి తగ్గిన తర్వాత, ఫిబ్రవరిలో వచ్చే క్రేజీ సినిమా ఇదే కావచ్చు. వాలెంటైన్స్ డే మూడ్ లో లవర్స్ కు, ఫ్యామిలీ ఆడియెన్స్ కు ఈ 'ఫంకీ' రైడ్ బాగా కనెక్ట్ అయ్యే ఛాన్స్ ఉంది. మరి ఈసారి మాస్ కా దాస్ నవ్వించి ఎలాంటి హిట్టు కొడతాడో చూడాలి.

# చీరకట్టులో అనసూయ రాజసం.. గ్లామర్ కవ్వింతలు!

**ఈ ఫొటోషూట్లో హైలెట్ ఆమె హెయిర్ స్టైల్ అనే చెప్పాలి. ఉంగరాల జుట్టును గాలికి వదిలేసి, ఆ కురుల మాటున ఆమె ఇస్తున్న ఎక్స్ప్రెషన్స్ కుర్రాళ్లను కట్టిపడేస్తున్నాయి.**



బుల్లితెర నుంచి వెండితెరకు వచ్చి సక్సెస్ అయిన వారిలో అనసూయ భరద్వాజ్ టాప్ లిస్ట్ లో ఉంటారు. యాంకర్గా తన ప్రయాణం మొదలుపెట్టినా, ఇప్పుడు స్టార్ నటిగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. ఒకవైపు సినిమాలు, మరోవైపు షోలతో బిజీగా ఉంటూనే.. సోషల్ మీడియాలో తన గ్లామర్తో ఎప్పుడూ ట్రెండింగ్లో ఉండటం ఈ బ్యూటీ స్పెషాలిటీ. తనదైన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులలో చెరగని ముద్ర వేసుకున్నారు. లేటెస్ట్ గా అనసూయ తన ఇన్స్టాగ్రామ్లో షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట సెగలు రేపుతున్నాయి. మెటాలిక్ బ్లూ, గోల్డ్ కలర్ కాంబినేషన్ ఉన్న పట్టుచీరలో ఆమె రాజసం ఉట్టిపడేలా కనిపిస్తున్నారు. దీనికి మ్యాచింగ్గా స్లీవ్లెస్ డిజైనర్ బ్లౌజ్ ధరించి, ట్రెడిషనల్ చీరకట్టులోనూ గ్లామర్ డోస్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. ఆమె లుక్ చూస్తుంటే క్లాసీగా ఉంటూనే ఎంతో గ్లామర్ గా, స్టైలిష్గా అనిపిస్తోంది. డెకాయిట్ కోసం భలే ప్లాన్ ఈ ఫొటోషూట్లో హైలెట్ ఆమె హెయిర్ స్టైల్ అనే చెప్పాలి. ఉంగరాల జుట్టును గాలికి వదిలేసి, ఆ కురుల మాటున ఆమె ఇస్తున్న ఎక్స్ప్రెషన్స్ కుర్రాళ్లను కట్టిపడేస్తున్నాయి. భారీ ఆభరణాల జోలికి వెళ్లకుండా, కేవలం పెద్ద డిజైనర్ చెవిపోగులు, చేతికి నల్లటి గాజులు ధరించి సింపుల్గా మెరిసిపోయారు. హిందీ పాట లిరిక్స్ను క్యాప్షన్గా పెడుతూ, తనలోని లవ్లీ యాంగిల్ను బయటపెట్టారు. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనలోనూ తనకు తానే సాటి అని అనసూయ ఎప్పుడో నిరూపించుకున్నారు. 'రంగస్థలం'లో రంగమ్మత్తగా, 'పుష్ప'లో దాక్షాయణిగా ఆమె చేసిన పాత్రలు అంత సులభంగా మర్చిపోలేం. విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ, స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను కూడా ఎంచుకుంటూ నటిగా తన పరిధిని రోజురోజుకూ పెంచుకుంటున్నారు. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. సినిమా షూటింగ్లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అనసూయ ఎప్పుడూ యాక్టివ్గా ఉంటారు. అప్పుడప్పుడు వెస్ట్రన్ వేర్లో షాక్ ఇస్తూనే, ఇలాంటి చీరకట్టులో అచ్చమైన తెలుగుదనాన్ని చూపిస్తూ ఫ్యాన్స్ను సర్ప్రైజ్ చేస్తుంటారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు ఆమె అందాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. వయసు పెరుగుతున్నా ఆమెలోని గ్లామర్, ఎనర్జీ ఏమాత్రం తగ్గలేదని పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు.

# దేఖ్ లేంగే సాలా కు ఆ డైరెక్టర్ ఫిదా

**దేఖ్ లేంగే సాలా అంటూ సాగే ఈ సాంగ్ మ్యూజిక్ లవర్స్ తో పాటూ సాధారణ ప్రేక్షకుల్ని కూడా ఎంతగానో ఆకట్టుకుంది.**





పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఉస్తాద్ భగత్‌సింగ్. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇదిలా ఉంటే రీసెంట్ గా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేశారు. దేఖ్‌లేంగే సాలాకు మంచి రెస్పాన్స్ దేఖ్ లేంగే సాలా అంటూ సాగే ఈ సాంగ్ మ్యూజిక్ లవర్స్ తో పాటూ సాధారణ ప్రేక్షకుల్ని కూడా ఎంతగానో ఆకట్టుకుంది. పైగా ఈ సాంగ్ లో పవర్ స్టార్ వేసిన స్టెప్పులు ఫ్యాన్స్ ను ఎంతో అలరించడంతో పాటూ ఆ స్టెప్పులు చూసి పవన్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు. ఇప్పటికే పవన్, దేవీ శ్రీ ప్రసాద్ కలయికలో పలు సినిమాలు రాగా, అవన్నీ చార్ట్ బస్టర్ ఆల్బమ్స్ అయ్యాయి. వాళ్లకంటే మనవాళ్లే బెటర్! ఇదేం షాక్ భాయ్? స్టెప్పులతో ఆకట్టుకున్న పవర్ స్టార్ వారిద్దరి కాంబినేషన్ లో వచ్చిన సాంగ్స్ అన్నీ మ్యూజికల్ హిట్సే. అంతేకాదు, గతంలో హరీష్ శంకర్, పవన్ కళ్యాణ్, దేవీ శ్రీ ప్రసాద్ కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ సాంగ్స్ బ్లాక్ బస్టర్ హిట్స్ అనే సంగతి కొత్తగా చెప్పనక్కర్లేదు. ఈ సాంగ్ లో పవన్ వేసిన స్టెప్పుల్లో గ్రేస్ బాగా కనిపిస్తోంది. మనకేమైనా సమస్యలొచ్చినప్పుడు స్ఫూర్తినిచ్చేలా ఈ సాంగ్ ఉంటుందని మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ చెప్పగా, ఈ మూవీ నుంచి వచ్చే ప్రతీ కంటెంట్ అద్భుతంగా ఉంటుందని, సినిమా తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుందని నిర్మాత నవీన్ యేర్నేని చెప్పారు. లైంగిక దాడి కేసులో నటికి ఊరట.. బాధితురాలికి అండగా నిందితుడి భార్య ఇదిలా ఉంటే దేఖ్ లేంగే సాలా సాంగ్ కు ఇప్పటికే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ఈ సాంగ్ గురించి ఓ స్పెషల్ వీడియో రాబోతున్నట్టు తెలుస్తోంది. టాలీవుడ్ సీనియర్ డైరెక్టర్ వివి వినాయక్ కు ఈ పాట తెగ నచ్చేసిందని, ఈ సందర్భంగా ఓ స్పెషల్ వీడియో కూడా రాబోతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే చాలా రోజుల తర్వాత తనకు డ్యాన్స్ వేయాలనిపిస్తుందని పవన్ కళ్యాణ్ గారు ఈ సినిమాలోని సాంగ్ విని తనతో అన్నారని గతంలో దేవీ శ్రీ ప్రసాద్ చెప్పింది బహుశా ఈ పాట గురించేనేమో అని ఇప్పుడంతా అనుకుంటున్నారు.

# బాలయ్య 'అఖండ 2'.. నార్త్ వసూళ్ల సంగతేంటి?



టాలీవుడ్ నటసింహం బాలకృష్ణ.. రీసెంట్ గా అఖండ 2: తాండవం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ అఖండకు సీక్వెల్ గా రూపొందిన ఆ సినిమాకు బోయపాటి శ్రీను దర్శకత్వం వహించగా.. డిసెంబర్ 12వ తేదీన వరల్డ్ వైడ్ గా థియేటర్స్ లో గ్రాండ్ గా విడుదలైంది. అయితే అప్పట్లో అఖండ మూవీ తెలుగులో మాత్రమే రిలీజ్ అవ్వగా.. ఇప్పుడు సీక్వెల్ అఖండ 2 తాండవం మాత్రం పాన్ ఇండియా రేంజ్ లో రూపొందింది. అందుకు కారణం.. ఓటీటీలోకి అఖండ అందుబాటులోకి వచ్చాక నార్త్ లో అదిరిపోయే రెస్పాన్స్ రావడమే. అందుకే సీక్వెల్ ను పాన్ ఇండియా రేంజ్ లో రూపొందించారు మేకర్స్. డెకాయిట్ కోసం భలే ప్లాన్ సినిమాలో సనాతన ధర్మం, దేశభక్తికి సంబంధించిన అంశాలను ఉత్తరాది ఆడియన్స్ కోసమే ఎక్కువగా పెంచినట్లు తెలుస్తోంది. శివుని తాండవం, హనుమంతుడి ప్రత్యక్షం, అనేక భక్తి పరమైన సన్నివేశాలు సినిమాకు హిందీలో ఆదరణ పెంచే లక్ష్యంతోనే చేర్చారని తెలుస్తోంది. అంతే కాదు.. ప్రమోషన్స్ కూడా ఫుల్ గా నిర్వహించారు. విడుదలకు కొద్ది రోజుల ముందు బాలయ్య ముంబై వెళ్లి మరీ సందడి చేశారు. కొన్ని హిందీ యూట్యూబ్ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆ సమయంలో ఆయన కామెంట్స్.. మీమ్స్ గా మారినప్పటికీ.. డైరెక్టర్ తో కలిసి బాలయ్య కాస్త గట్టిగానే ప్రమోట్ చేశారు. అంతే కాదు.. నార్త్ లో పెద్ద ఎత్తున అఖండ 2 తాండవం మూవీని విడుదల చేశారు. వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ! అయితే ఇప్పుడు సినిమా హిందీ వెర్షన్ వసూళ్ల వివరాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మొదటి మూడు రోజుల్లో హిందీ వెర్షన్ రూ.35 లక్షలు మాత్రమే వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో అది చాలా తక్కువ అనే చెప్పాలి. ఎక్కువ ఊహించామని, నార్త్ లో అఖండ సీక్వెల్ కు తక్కువే వచ్చాయని నెటిజన్లు అంటున్నారు. ఫస్ట్ వీకెండ్ అయిపోయాక కూడా అంత తక్కువ వసూళ్లు వచ్చాయా అని కొందరు షాక్ అవుతున్నారు. అదే సమయంలో ప్రీమియర్స్ తో కలిపి మూవీ రూ.59.5 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ తెలిపారు. బాలకృష్ణ కెరీర్ లోనే మొదటిరోజు ఈ స్థాయిలో వసూలు చేసిన ఫస్ట్ మూవీ ఇదేనని చెప్పారు. ఇప్పుడు మూడు రోజులకు గాను వరల్డ్ వైడ్ గా రూ. 76 కోట్లు వసూల్ అయినట్లు వార్తలు వస్తున్నాయి.

# వారణాసి.. విక్రమార్కుడు తర్వాత ఇప్పుడేనా..

**ఇక్కడ ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన విషయం ఒకటుంది. ప్రకాష్ రాజ్ లాంటి గొప్ప నటుడు తెలుగులో దాదాపు అందరు అగ్ర దర్శకులతో పనిచేశారు.**

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న 'వారణాసి' సినిమా మీద రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి. గ్లోబల్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో కాస్టింగ్ విషయంలో జక్కన్న చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లేటెస్ట్ గా ఈ సినిమా సెట్ లోకి విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ అడుగుపెట్టారనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తి రేపుతోంది. ఇందులో ఆయన మహేష్ బాబుకు తండ్రి పాత్రలో కనిపించబోతున్నారట. ఈ పాత్ర సినిమాకు చాలా కీలకం అని తెలుస్తోంది. డెకాయిట్ కోసం భలే ప్లాన్ నిజానికి రాజమౌళి ఈ తండ్రి పాత్ర కోసం మొదట ప్రకాష్ రాజ్ ను అనుకోలేదట. వేరే ఒకరిద్దరు సీనియర్ నటులపై టెస్ట్ షూట్ కూడా నిర్వహించారని టాక్. కానీ వాళ్ళ పర్ఫార్మెన్స్ విషయంలో రాజమౌళికి ఎక్కడో చిన్న అసంతృప్తి ఉండిపోయిందట. తన కథకు, ఆ పాత్రలోని ఎమోషన్ కు ఆ నటులు సరిపోలేదని భావించి, చివరకు ఆ పాత్రను ప్రకాష్ రాజ్ దగ్గరకు తీసుకెళ్లారట. ఆయన సెట్ లోకి రావడంతో ఆ పాత్రకు నిండుతనం వచ్చిందని యూనిట్ వర్గాల మాట. ఇక్కడ ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన విషయం ఒకటుంది. ప్రకాష్ రాజ్ లాంటి గొప్ప నటుడు తెలుగులో దాదాపు అందరు అగ్ర దర్శకులతో పనిచేశారు. పూరీ జగన్నాథ్, వినాయక్, త్రివిక్రమ్, కృష్ణవంశీ.. ఇలా ఆ జనరేషన్ దర్శకులందరి సినిమాల్లో ఆయన పాత్రలు హైలైట్ గా నిలిచాయి. కానీ విచిత్రంగా రాజమౌళితో మాత్రం ఆయన ట్రావెల్ చాలా తక్కువ. ఇప్పటివరకు వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చింది ఒక్క 'విక్రమార్కుడు' సినిమా మాత్రమే. వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ! అప్పట్లో వచ్చిన విక్రమార్కుడు సినిమాలో కూడా ప్రకాష్ రాజ్ ది మెయిన్ విలన్ పాత్ర కాదు. ఆయన చేసింది చాలా తక్కువ నిడివి ఉన్న పాత్రే. ఆ తర్వాత రాజమౌళి తీసిన మగధీర, ఈగ, బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి ఏ సినిమాలోనూ ప్రకాష్ రాజ్ కు అవకాశం రాలేదు. ఇన్నాళ్లకు మళ్లీ 'వారణాసి' సినిమాతో ఈ రేర్ కాంబినేషన్ సెట్ అయ్యింది. అందుకే ఈసారి రాజమౌళి ఆయనకు ఎలాంటి పాత్ర ఇచ్చారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. టెస్ట్ షూట్స్ చేసి మరీ, వేరే వాళ్లు సరిపోరని ప్రకాష్ రాజ్ ను తీసుకున్నారంటే.. ఈసారి ఆయన పాత్ర నిడివి, ప్రాధాన్యత కచ్చితంగా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. విక్రమార్కుడు సినిమాలోలాగా ఏదో వచ్చిపోయే పాత్రలా కాకుండా, కథను మలుపు తిప్పే బలమైన ఎమోషనల్ పాత్ర అయ్యుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజమౌళి సినిమాల్లో తండ్రి పాత్రలకు ఎప్పుడూ ఒక పవర్ ఉంటుంది. మరోవైపు మహేష్ బాబు, ప్రకాష్ రాజ్ కాంబినేషన్ అంటేనే ఆన్ స్క్రీన్ మ్యాజిక్ అని అందరికీ తెలిసిందే. ఒక్కడు, దూకుడు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి సినిమాల్లో వీరిద్దరి నటన అద్భుతంగా పండింది. ఇప్పుడు ఆ సెంటిమెంట్ కు రాజమౌళి టేకింగ్ తోడవుతోంది. దాదాపు దశాబ్దన్నర తర్వాత రాజమౌళి సినిమాలో ప్రకాష్ రాజ్ నటిస్తుండటంతో, ఈసారి ఆయన విశ్వరూపం గ్లోబల్ స్థాయిలో చూడొచ్చని ఫ్యాన్స్ ఫిక్స్ అవుతున్నారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com